# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 09 సంచిక :222 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: శుక్రవారం 08-11-2024 పేజీలు:4 వెల: 2.00


## యూపి ప్రభుత్వంపై సుప్రీం ఆగ్రహం

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఇంటిని కూల్చివేయడమేంటని సంబంధిత అధికారులను ప్రశ్నించింది. బాధితుడికి రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. 2019 లో రోడ్డు విస్తరణలో భాగంగా మహారాజ్‌గంజ్ నివాసి మనోజ్ తిబ్రేవాల్ ఆకాశ్ ఇంటిని అధికారులు కూల్చివేశారు. ఇంటిని ఖాళీ చేయాలని అతడికి ఎలాంటి నోటీసులను పంపించకుండానే ఈ చర్యలకు ఉపక్రమించారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ బాధితుడు సుప్రీం కోర్టును ఆశ్రయించాడు.నాడు దాఖలైన పిటిషన్‌పై తాజాగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వం లోని ధర్మాసనం విచారణ చేపట్టింది. నోటీసులు ఇవ్వకుండా సౌండ్ స్పీకర్ ద్వారా ఇంటిని ఖాళీ చేయాలని చెప్పడం ఆమోదయోగ్యం కాదని ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధితుడికి నష్టపరిహారంగా రూ. 25 లక్షలను అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. కూల్చివేతకు కారణమైన అధికారులు, కాంట్రాక్టర్లపై విచారణ జరపాలని, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

## సీఎం రేవంత్ రెడ్డి బర్త్ డే షెడ్యూల్ ఇదే..

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన పుట్టిన రోజును జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా రేపు ఉదయం 8 గంటలకు ఆయన తన కుటుంబ సమేతంగా యాదాద్రికి వెళ్లనున్నారు. ఉదయం 8:45 గంటలకు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు YTDA అధికారులతో ఆలయ అభివృద్ధిపై సీఎం సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం మూసి పునరుజ్జీవ ప్రజా చైతన్య పాదయాత్ర ప్రారంభించనున్నారు.

**ప్రజా చైతన్య పాదయాత్ర**

మధ్యాహ్నం 1 గంటకు వలిగొండ మండలం సంగెం నుంచి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా చైతన్య పాదయాత్ర చేపడుతారు. మూసీ పరివాహక ప్రాంతంలో 6కిలోమీటర్లు పాదయాత్ర చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగానే భీమలింగం, ధర్మారెడ్డి కాల్వలను సందర్శించనున్నారు. అనంతరం మూసి పరివాహక ప్రాంత రైతులతో సమావేశం కానున్నారు. రైతుల యోగా



క్షేమాలు అడిగి తెలుసుకోనున్నారు. రైతులతో సమావేశం అనంతరం తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఎంపీ చామల కిరణ్ కుమార్, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

## మాదాపూర్‌లో ఫుట్ పాత్ ఫుడ్ వర్కర్స్ యూనియన్ ధర్నా

హైదరాబాద్ : కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు రోడ్ల మీదకు వస్తున్నారు. తాజాగా మాదాపూర్ ఐటీసీ కోహినూర్ ఎదురుగా ఫుట్ పాత్ ఫుడ్ వర్కర్స్, యూనియన్ సభ్యులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గతంలో సీఎం రేవంత్ రెడ్డి కుమారి ఆంటీ విషయంలో అక్కడ ఫుడ్ స్టాల్స్ అన్నిటికి పర్మిషన్ ఇచ్చారు. కానీ, ఇప్పుడు అక్కడ ఉన్న కొన్ని సంస్థలు జీహెచ్ఎంసీ సహాయంతో వాటిని తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు ఉన్న పలంగా మా జీవనాధారాన్ని తొలగిస్తే ఎలా బతుకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సీఎం రేవంత్ కలుగజేసుకుని తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.



## అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో సైబరాబాద్ సీపీ ఆకస్మిక తనిఖీ

హైదరాబాద్ : అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. స్టేషన్‌లోని ఫైల్స్‌ను పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. డ్రగ్స్, గంజాయి విక్రయాలపై సీరియస్‌గా దృష్టిపెట్టాలని, కమిషనరేట్ పరిధిలో ఇదే అత్యంత సీరియస్ సమస్యగా మారుతోందదన్నారు. అందరూ సీరియస్‌గా పనిచేయాలని, అనుమానిత ప్రాంతాలు, వ్యక్తులపై నిఘా వేసి ఉంచాలని పోలీసులను ఆదేశించారు. కేసుల దర్యాప్తు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండొద్దన్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనకు వివరించాలని ఆదేశించారు.



## పంట వ్యర్థాలు తగలబెట్టే రైతులకు రెట్టింపు జరిమానా

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ తీవ్రమవుతోంది. గత కొన్ని రోజులుగా ఢిల్లీ - ఎన్సీఆర్ ప్రాంతంలో గాలి నాణ్యత చాలా పేలవమైన స్థాయిలో నమోదవుతోంది. ఏక్యూఐ లెవల్స్ రాజధాని ప్రాంతంలో 400కుపైనే నమోదవుతోంది. పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాల్లో రైతులు తమ పంట వ్యర్థాలను తగలబెడుతుండటంతో రాజధాని ప్రాంతంలో ఈ పరిస్థితి తలెత్తుతోంది.%కాలుష్య నియంత్రణకు పాలకులు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం ఉండటం లేదు. రోజురోజుకూ గాలి నాణ్యత క్షీణిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పంట వ్యర్థాలను దహనం చేసే రైతులకు రెట్టింపు జరిమానా విధించేలా నిబంధనలను సవరించింది. రూ.30 వేల వరకూ జరిమానాను పెంచింది. ఈ నిబంధనలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపింది. కేంద్ర నిబంధనల ప్రకారం.. రెండు ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు రూ.5 వేల జరిమానా విధించనున్నారు. రెండు నుంచి ఐదు ఎకరాల మధ్య ఉన్న వారికి రూ.10 వేలు, ఐదెకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు రూ.30 వేలు జరిమానా విధించనున్నారు.కాగా, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. ఉదయం 9 గంటలకు ఢిల్లీలో గాలి నాణ్యత 367గా నమోదైంది. ఆనంద్



విహార్, జహంగీర్‌పురి, అశోక్ విహార్, బావన, ముండ్కల్, రోహిని, సోనియా విహార్, వివేక్ విహార్, వాజీపూర్.. ఈ తొమ్మిది ప్రాంతాల్లో గాలి నాణ్యత తీవ్రమైన కేటగిరీలో ఉందని కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. మరోవైపు కాలుష్యం కారణంగా ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఓ వైపు వాయు కాలుష్యంతో ఊపిరితీసుకోవడం ఇబ్బందికరంగా మారగా.. మరో వైపు నీటి కాలుష్యంతోనూ సతమతమవుతున్నారు. యయునా నదిలో కాలుష్య స్థాయి విపరీతంగా ఉన్నది.

## సీఐఏ చీఫ్‌గా ఇండియన్‌కు ఛాన్స్.. ఎవరీ కశ్యప్ పటేల్?

న్యూయార్క్: సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ చీఫ్‌గా కశ్యప్ పటేల్‌కు అవకాశం దక్కనున్నది. అమెరికా కొత్త అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. భారతీయ సంతతికి వ్యక్తికి ఆ కీలక పదవిని అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ట్రంప్ కోసం ఏపని అయినా చేసేందుకు కశ్యప్ సిద్ధంగా ఉన్నారు. అయితే కశ్యప్ పటేల్‌కు గుజరాతీ మూలాలు ఉన్నాయి. ఈస్ట్ ఆఫ్రికాలో ఆయన పేరెంట్స్ పెరిగారు. 1970 దశకంలో ఆయన తండ్రి ఉగాండా నుంచి వలస వచ్చారు.

1980లో న్యూయార్క్ గార్డెన్ సిటీలో ఆయన జన్మించారు. హిందువుగా ఆయన పెరిగారు. వర్ణ వివక్షకు వ్యతిరేకంగా ఆయన పోరాడారు. రిచ్‌మండ్ యూనివర్సిటీలో ఆయన గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. న్యూయార్క్‌లో లా డిగ్రీ చదివారు. యూకేలోని యూనివర్సిటీ కాలేజీ లండన్ ఫాకల్టీ ఆఫ్ లాస్ నుంచి ఇంటర్నేషనల్ లా సర్టిఫికేట్ పొందారు. రక్షణశాఖ మాజీ కార్యదర్శి క్రిస్టోఫర్ మిల్లర్ వద్ద పనిచేశారు. నేషనల్ సెక్యూర్టీ కౌన్సిల్‌లో కౌంటర్ టెర్రరిజం సీనియర్ డైరెక్టర్‌గా చేశారు.

గతంలో డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ సమయంలో.. ఐసిస్, ఆల్‌ఖయిదా కీలక నేతల హత్యలకు మిషన్ నడిపించారు. హౌజ్ కమిటీకి చెందిన ఇంటెలిజెన్స్‌కు నేషనల్ సెక్యూర్టీ అడ్వైజర్‌గా చేశారు. 2016 ఎన్నికల్లో రష్యా ప్రమేయంపై



విచారణాధికారిగా చేశారు. లాయర్‌గా అనేక కేసుల్ని వాదించారు. హత్యలు, నార్కో ట్రాఫికింగ్, ఆర్థిక నేరాల గురించి ఫెడరల్ కోర్టుల్లో వాదించారు. 2019లో ట్రంప్ టీంలో కశ్యప్ పటేల్ చేరినట్లు ఓ రిపోర్టు ద్వారా తేలింది. గత పాలన సమయంలో సీఏఐ డిప్యూటీ డైరెక్టర్‌గా కశ్యప్ పటేల్‌ను నియమించాలని ట్రంప్ ప్లాన్ వేసినట్లు తెలిసింది.

## తిరుమలలో డంపింగ్ యార్డును పరిశీలించిన టీటీడీ చైర్మన్

తిరుమల : తిరుమలలోని కాకులమాను దిబ్బ వద్ద ఉన్న డంపింగ్ యార్డును టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు గురువారం పరిశీలించారు. చెత్త సేకరణ, తడి చెత్త, పొడి చెత్త విభజన, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. చైర్మన్ వెంట టీటీడీ వీజీవో సురేంద్ర పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేసిన ముగ్గురు ధర్మకర్తల మండలి సభ్యులు

టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా గురువారం ముగ్గురు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. వీరిలో భాను ప్రకాష్ రెడ్డి, ముని కోటేశ్వరరావు, సుచిత్ర ఎల్లాఉన్నారు. శ్రీవారి ఆలయంలోని స్వామివారి సన్నిధిలో టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం శ్రీవారి తీర్థ ప్రసాదాలు,



చిత్రపటాన్ని అడిషనల్ ఈవో అందజేశారు.

## ఆలయంలో బంగారు చోరీ బంగారు

అహ్మదాబాద్: పురాతన ఆలయంలో చోరీ జరిగింది. అమ్మవారికి చెందిన రూ.78 లక్షల విలువైన బంగారు నగలను ఒక వ్యక్తి దొంగిలించాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి నిందితుడ్ని అరెస్ట్ చేశారు. గుజరాత్‌లోని పంచమహల్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అక్టోబర్ 28న పావగఢ్ కొండలపై ఉన్న పురాతన మహాకాళి దేవి ఆలయంలో చోరీ జరిగింది. ఆలయం గర్భగుడిలోకి ప్రవేశించిన దొంగ రూ. 78 లక్షల విలువైన ఆరు బంగారు హారాలు, బంగారు పూతపూసిన రెండు వస్తువులు అపహరించాడు.

కాగా, ఆలయ సిబ్బంది నుంచి ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఈ చోరీపై స్పందించారు. గుడితో పాటు పరిసర ప్రాంతాల్లోని 150కుపైగా సీసీటీవీల ఫుటేజ్‌ను పరిశీలించారు. దొంగతనం ముందు రోజు ఒక వ్యక్తి బైక్‌పై అనుమానాస్పదంగా ఆలయం వద్ద సంచరించడాన్ని గమనించారు. సూరత్‌కు చెందిన విదుర్‌భాయ్ వాసవగా గుర్తించారు. అక్కడికి వెళ్లిన పోలీసులు ఇంటి నుంచి నిందితుడ్ని అరెస్ట్ చేశారు. చోరీ



చేసిన ఆలయ ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఆలయం హాల్‌లోని వెంటిలేటర్ నుంచి గర్భగుడిలోకి ప్రవేశించి ఈ చోరీకి పాల్పడినట్లు పోలీస్ అధికారి తెలిపారు.

## కొడుకు పైసలు ఇయ్యలేదని తల్లిని కిడ్నాప్ చేసిన కాంట్రాక్టర్

రాజన్న సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లాలోఅమానవీయ ఘటన చోటు చేసుకుంది. తీసుకున్న డబ్బులివ్వడం లేదని మహారాష్ట్రకు చెందిన ఓ కాంట్రాక్టర్ బరితెగించాడు. ఏకంగా మేస్త్రీ తల్లిని బలవంతంగా తమ వెంటతీసుకెళ్లాడు. ఈ సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేము లవాడ అర్బన్ మండలంలో తీవ్ర కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళ్తే.. వేములవాడ అర్బన్ మండలం కొడుముంజ గ్రామానికి చెందిన పల్లపు శ్రీను అనే వ్యక్తి బండ పని మేస్త్రీగా పనిచేస్తున్నాడు. కాగా, మహారాష్ట్రకు చెందిన లాలు దేవకర్ అండ్ టీం కర్ణాటకలో చెరుకు తోటలను కోసే పనులను కాంట్రాక్టు తీసుకున్నారు. ఇందుకోసం కూలీలు అవసరం ఉండగా.. శ్రీను, అతడి సోదరుడిని సంప్రదించారు. ప్రస్తుతం శ్రీను, అతని సోదరుడు ఛత్తీస్‌గఢ్‌లో కూలీ పనులు చేస్తున్నారు. అయితే లాలు దేవకర్‌కు సంబంధించి కర్ణాటకలోని చెరుకు తోట కొట్టడానికి కావాల్సిన కూలీల కోసం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కూలీలతో శ్రీను ఒప్పందం కుదిర్చాడు. దీనికి మధ్య వర్తిత్వంగా శ్రీను వ్యవహరించాడు. ఇందుకోసం లాలు దేవకర్ రూ.3.80 లక్షలను కూలీలకు చెల్లించాడు. అయితే కూలీలు పనులకు రాకపోవడంతో లాలు దేవకర్‌కు, కొడుముంజకు చెందిన శ్రీను, అతడి



సోదరునికి మధ్య వివాదం చోటుచేసుకుంది. తన డబ్బులు తిరిగి చెల్లించాలని లాలు దేవకర్ శ్రీను అతడి సోదరుడిపై ఒత్తిడి చేశాడు. ఈ విషయంలో పలుమార్లు చర్చలు జరిగాయి. ఈ క్రమంలో లాలు దేవకర్, మరికొంత మంది కొడుముంజ ఆర్ అండ్ ఆర్ కాలనీలోని శ్రీను ఇంటికి వచ్చి ఇంట్లో ఉన్న శ్రీను తల్లి పల్లపు భీమా బాయిని బలవంతంగా కారులోకి ఎక్కించి కిడ్నాప్‌కు పాల్పడ్డారు. డబ్బులిచ్చి తల్లిని తీసుకెళ్లాలంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మాజీ మంత్రి మల్లారెడ్డికి ఈడీ నోటీసులు

తెలంగాణలోని పలు ప్రైవేట్ మెడికల్ కాలేజీలు పీజీ సీట్లు అక్రమంగా విక్రయించుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై ఈడీకి ఫిర్యాదులందాయి. దాంతో గతేడాది జూన్‌లో ఈడీ రంగంలోకి దిగి మాజీ మంత్రి మల్లారెడ్డితోపాటు ఇతర ప్రదేశాల్లో సోదాలు చేపట్టింది. ఈ క్రమంలో పలు హార్డ్ డిస్కులు, కీలక పత్రాలను స్వాధీనం చేసుకుంది.

: మాజీ మంత్రి మల్లారెడ్డికి ఈడీ నోటీసులు

హైదరాబాద్, నవంబర్ 07: పీజీ మెడికల్ కాలేజీ సీట్లు అక్రమంగా విక్రయించారనే అభియోగాలపై మాజీ మంత్రి సిహెచ్ మల్లారెడ్డికి ఈడీ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. దీనిపై ఈ రోజు జరిగే విచారణకు హాజరు కావాలని ఆయనకు జారీ చేసిన నోటీసుల్లో ఈడీ స్పష్టం చేసింది. దీంతో ఈడీ ఎదుట విచారణకు మల్లారెడ్డి మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేందర్ రెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఈడీకి ఆయన వివరణ ఇచ్చినట్లు సమాచారం. తెలంగాణలో పలు మెడికల్ కాలేజీల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లు విక్రయించారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ క్రమంలో ఈడీకి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఈడీ రంగంలోకి దిగింది. అందులోభాగంగా గతేడాది జూన్‌లో మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి నివాసం, మెడికల్



కాలేజీతోపాటు కార్యాలయాలపై ఈడీ సోదాలు నిర్వహించింది.అలాగే 12 మెడికల్ కాలేజీల్లో సైతం సోదాలు చేపట్టింది. ఈ సందర్భంగా కీలక డాక్యుమెంట్లు, పెన్‌డ్రైవ్‌లు, హార్డ్‌డిస్క్‌లను సైతం ఈడీ స్వాధీనం చేసుకుంది. రాష్ట్రంలోని 10 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోని 45 సీట్లను బ్లాక్ చేసి విక్రయించినట్లు.. ఈడీ తన సోదాల్లో గుర్తించింది. దాంతో దీనిపై వివరణ ఇవ్వాలంటూ మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డితోపాటు వివిధ ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు ఈడీ నోటీసులు జారీ చేసింది.

## ఇందిరమ్మ రాజ్యంలో.. దళారులపాలవుతున్న రైతుల రెక్కల కష్టం: కేటీఆర్

హైదరాబాద్: ఇందిరమ్మ రాజ్యంలో దోపిడీ రాజ్యమేలుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రైతుల రెక్కలకష్టం దర్జాగా దళారుల పాలవుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఆఫీసులో కనుగోలు కేంద్రం తప్ప రాష్ట్రంలో ఒక్క కొనుగోలు కేంద్రం పనిచేస్తలేదని విమర్శించారు. ఏ రైతుకు ముఖ్యమంత్రి మద్దతు లేదని, అందుకే వరికి, పత్తికి, దేనికీ మద్దతు ధర లేదని ఎక్స్ వేదికగా ఫైర్ అయ్యారు.సన్నాలకే బోనస్ అన్న సన్నాసుల మాట మార్కెట్ యార్డుల సాక్షిగా నీటిమూటే అయ్యిందని విమర్శించారు. మొన్న రైతుకు రుణమాఫీ చెయ్యలే, నిన్న రైతుకు పెట్టుబడి సాయం ఇయ్యలేదని చెప్పారు. నేడు రైతు పండించిన పంటను



కొనుగోలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక.. ఈ ఇందిరమ్మ రాజ్యం ఉండెందుకు.. ఆరుగాలం కష్టించే అన్నదాతను అరిగోస పెట్టేటందుకా అని ప్రశ్నించారు.

## సంపాదకీయం

శుక్రవారం 08-11-2024

# గెలుపు కోసం ఉచిత విన్యాసాలు !

ఎన్నికల్లో గెలవడమే లక్ష్యం. కాంగ్రెస్ కావచ్చు..బిజెపి కావచ్చు..తాయిలాలు ప్రకటించి ప్రజలను బురిడీ కొట్టిస్తున్నాయి. ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నాయి. అధికారంలోకి రాగానే తమ స్వలాభమే తప్ప ప్రజల మేలుకోరి పనిచేయడం లేదు. కేంద్రంలో పదేళ్లు దాటినా బిజెపిలో మార్పురావడం లేదు. 2 కోట్ల ఉద్యోగాల హామీ గాలిలో, ఢిల్లీ కాలుష్యంలో కొట్టుకు పోయింది. కేవలం పన్నులు బాదడం తప్ప దానికి మరోటి తెలియడంలేదు. జార్ఖండ్,మహారాష్ట్రల్లో మాత్రం కాంగ్రెస్, బిజెపిలు అధికారం కోసం నానాగడ్డి కరుస్తున్నాయి. జార్ఖండ్ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో ఇండియా కూటమి తన మేనిఫెస్టో విడుదల చేసింది. కూటమి పార్టీలైన జార్ఖండ్ ముక్తిమోర్చా (జెఎంఎం), కాంగ్రెస్, ఆర్జేడీ, సీపీఎం ఉమ్మడిగా ఏడుగ్యారంటీలతో ఈ మేనిఫెస్టోను ప్రకటించాయి. పదిలక్షలమంది యువతకు ఉపాధి, పదిహేను లక్షల రూపాయలవరకూ ఆరోగ్యబీమా, నాలుగువందల యాభైరూపాయలకే సిలండర్, మహిళలకు నెలకు రెండున్నరవేల రూపాయలు, ప్రతివ్యక్తికీ ఏడుకేజీల ఆహారధాన్యాలు, వరి కనీసమద్దతుధరను ఎనిమిది వందల రూపాయలు పెంచడం, వెనుకబడిన తరగతులవారికి ప్రత్యేక కమిషన్, మైనారిటీల హక్కుల పరిరక్షణ ఇందులో ఉన్నాయి. ఈ హామీలన్నీ ఇప్పుడు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కొనసాగించివుంటే నమ్మకం ఉండేది. కానీ బిజెపి,కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలకే దిక్కులేదు. ఆదివాసుల ఓట్లకోసం బీజేపీ ఎంతగా కష్టపడుతోంది. ఇటీవలి ఎన్నికల సభలో మోదీ చేసిన వ్యాఖ్యలు చూస్తే ఇది తెలియచెబుతాయి. ప్రధానంగా బంగ్లాదేశీ అక్రమ వలసదారులు జార్ఖండ్ మూలమూలల్లోకి చొరబడ్డారని, వారికి దొంగసర్టిఫికేట్లు ఇచ్చి స్థిరపరచడం ద్వారా ఇండియా కూటమిలోని పార్టీలు అతిపెద్ద ఓటుబ్యాంకును తయారుచేసుకున్నాయని ఆరోపిస్తూ సెంటిమెంట్ ప్రయోగిస్తున్నారు. ఆ చొరబాటుదారులు గిరిజన ఆడబిడ్డలమీద అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, విద్యాసంస్థలకు మైనారిటీ గుర్తింపుతో ఆదివాసీ విద్యార్థులకు జెఎంఎం ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని బీజేపీ విమర్శలు చేస్తోంది. సంథాల్ పరగణాస్‌లో పెద్దసంఖ్యలో అక్రమ చొరబాటుదారులు స్థిరపడ్డారంటూ జార్ఖండ్ హైకోర్టులో ఒక పిల్ దాఖలు కావడం, దానిపై మీడియాలో విస్తృతంగా చర్చ జరుతూండటం ఎన్నికల్లో బిజెపి వాడుకుంటోంది.గత ఎన్నికల్లో బీజేపీ కంటే ఓ ఐదుసీట్లు ఎక్కువ తెచ్చుకున్న జెఎంఎం, కాంగ్రెస్‌తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రతీ చిన్న ఎన్నికనూ తీవ్రంగా తీసుకొనే బీజేపీ ఈ మారు జార్ఖండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి శాయశక్తులా ప్రయత్నిస్తోంది. బీజేపీ ఇప్పటికే విడుదల చేసిన మేనిఫెస్టోలో, తాను అధికారంలోకి రాగానే 2.87లక్షల ప్రభుత్వోద్యోగాలను భర్తీచేస్తానని, నెలకు రెండువేల రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇవ్వడంతోపాటు, మహిళలకు వివిధ పథకాలద్వారా దండిగానే ఆర్థిక సాయం ప్రకటించింది. పదేళ్ళక్రితం బీజేపీ ఆదివాసీయేతరులను, ప్రధానంగా ఓబీసీలను దగ్గరకు చేర్చుకొని జార్ఖండ్‌లో అధికారంలోకి రాగలిగింది. ఆ ఎన్నికల్లో మోదీ హవా ఉధృతంగా ఉన్నందువల్ల కూడా ఆ ఎత్తుగడ సులువుగా పనిచేసింది. కాని ఇప్పుడా పరిస్థితి లేదు. ఎందుకంటే బిజెపి పాలన ఎలావుందో గత పదేళ్లుగా ప్రజలు అనుభవిస్తున్నారు. అధికారంలోకి రావడం కోసం కర్ణాటక, తెలంగాణలో ఇష్టారీతిన ఇచ్చిన గ్యారెంటీలు, హామీలు, ప్రకటించిన పథకాలు అమలు చేయలేక, చేయలేమని ప్రజలకు చెప్పలేకపోతున్న తీరును ప్రజలు చూస్తున్నారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికలకు ముందు ఈ రకమైన హామీలు గుప్పించినా ప్రజలు ఇరుపార్టీలను నమ్మేంతగా పరిస్థితులు లేవు. ఎన్నికల సమయంలో అలవికాని హామీలిచ్చి ఏదోరకంగా ఆయా రాష్ట్రాల్లో అధికారం దక్కించుకునేందుకు బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ఎత్తుగడలు వేస్తున్నాయి. చాంతాడంత లిస్టుతో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తరవాత హామీలు అమలు చేయలేక చతికిలపడడం అలవాటు చేసుకున్నారు. ఐదేళ్ల తరవాత మళ్లీ కొత్తగాహామీలు ఇవ్వడానికి వెనకాడడంలేదు. ఇప్పటికే అనేక సందర్భాల్లో ఇచ్చిన హామీలు అమలుచేయలేని అసహాయతను బయటపెడుతున్నారు. దున్నపోతు మీద వాన పడినట్టు పట్టించుకోనట్టు నటించడం కూడా అలవాటు చేసుకున్నారు. మ్యానిఫెస్టోలో హామీలు గుప్పించడం మాత్రంమానడంలేదు. బీజేపీ పరిస్థితి కూడా కాంగ్రెస్‌కు భిన్నంగా ఏమీ లేదు. ఉచితాల గురించి అభ్యంతరాలు వ్యక్తం చేసే మోదీ బృందం కూడా వాటి బాటే పట్టింది. ప్రతీ మహిళకు రూ.2,100 ఇస్తామని ఝార్ఖండ్‌లో చెప్పిన బీజేపీ, నిరుద్యోగ భృతి కూడా ఇస్తామని చెప్పింది. మహారాష్ట్రలోనూ ఇదే అంశంపై బీజేపీ ఆధారపడ్డట్టు కన్పించింది. ముఖ్యమంత్రి లడ్కీ బచావ్ పేరుతో మహిళలకు ప్రతీ నెల రూ.1500 హామీ ఇచ్చి, ఇప్పటికే పాక్షికంగా అమలుచేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ల పంపిణీ హామీ మామూలే. ఉచితాలు, హామీల విషయంలో ఈ రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ కూటములు కూడా తక్కువేం తినలేదు. ఒకడుగు ముందుకేసి మహారాష్ట్రలో ప్రతి మహిళకు నెలకు రూ.2 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ, కర్ణాటక అనుభవా లతో కాంగ్రెస్ హామీలకన్నా, అధికారమే మిన్న అన్న ధోరణిలో సాగుతో ంది. గత హామీల అమలుకు దిక్కు లేకున్నా, కొత్త హా మీలు, పథకా లు ప్రకటిస్తే ప్రజలు ఓట్లేస్తారులే అన్న ధీమాలో కాంగ్రెస్, బీజేపీలు ఉన్నట్లుగా కనపడుతున్నది. బీజేపీ, కాంగ్రెస్‌లకు ఏ విషయంలో విభేదా లున్నా ప్రజలకిచ్చే హామీల విషయంలో ఈ రెండు పార్టీల వ్యవహారశైలి ఒక్కటే అన్నట్టుగా ఉన్నది. ప్రజల నిజమైన అవసరాలపై వాటికి పట్టింపులేదు. ఇచ్చిన హామీలు తప్పనిసరిగా నెరవేర్చాలనే బాధ్యత లేదు. అధికారమే పరమావధి అన్నట్టుగా వీరి కార్యాచరణ ఉంది. అందుకే ప్రజలు ఎప్పటికప్పుడు చైతన్యం కావాలి. మిగతా రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారా లేదా తెలుసుకోవాలి. అలాగే ఉచిత హామీలను తిరస్కరించాలి. అప్పుడే నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేస్తారని గుర్తించాలి.

# పట్టభద్రుని ఓటుకు పచ్చసంతకం కావాలా!

హైదరాబాద్,ఓటు హక్కు.. ఎంతో గొప్పది. తమకు, సమాజానికి కావాల్సిన ఓ మంచి నాయకున్ని ఎన్నుకొని రేపటి భవిష్యత్తును నిర్మించుకోవడానికి ఓటు హక్కు ఉపయోగపడుతుంది. ఓటు హక్కు కోసం అంబేద్కర్ చేసిన పోరాటం అంతా ఇంతా కాదు. ఓటు హక్కుపట్ల అనేక మంది అనేక రకాలుగా అభిప్రాయాలు వ్యక్తం చేసినప్పటికీ ఆయన మాత్రం తల ఉన్న ప్రతీ ఒక్కరికీ లింగ భేదం లేకుండా 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు ఉండాల్సిందే అంటూ పట్టుబట్టి ఓటు హక్కును కల్పించారు. ఒకవేళ అంబేద్కర్ గనుక ఓటు హక్కు కోసం ఉద్యమమే చేయకుంటే నేడు అనేక మంది ఈ సమాజంలో కనీస గుర్తింపు ఉండేది కాదు. ఈ ఓటు హక్కు ఉందనే కనీసం ఐదేళ్లకోసారి అయినా కడు పేదోని గుడిసె ముందుకు ఓటు వేయమని రెండు చేతులు జోడించి కాస్త గౌరవించబడుతున్నాడు.ఆ ఓటు హక్కే లేకుంటే ఈ సమాజంలో ఊరి అవతల వెలియబడ్డ వాళ్లు.. ఇప్పటికీ కడు దీన స్థితిలో, ఆకలిచావుల్లో కొట్టుమిట్టాడుతున్న వారిని లెక్కల్లోకి తీసుకునేవారేకాదు. వారంతా కేవలం ఓట్ల సమయంలో మాత్రమే నాయకులకు గొప్పగా కన్పిస్తారు తప్ప ఇతర సమయాల్లో మాత్రం పట్టించుకోరు. రాజకీయ నాయకునికి కావాల్సింది ఓటు, దానికోసం ఎన్ని వేషాలు వేసైనా తనకు ఓటు వేయించుకోవాలని చూస్తారు. అయితే ఎన్నికల వ్యవస్థలో ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటుంది. ఓటరు జాబితాను సవరించడంతో పాటు కొత్త ఓట్లను నమోదు చేయడం, ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా ఓటర్లను గుర్తించి నమోదు చేస్తారు. పైగా పలు ప్రసార మాధ్యమాల ద్వారా, పెద్ద పెద్ద ప్రకటనలు హోర్డింగులతో ఓటు హక్కు వినియోగించుకుందాం అంటూ ప్రచారం చేస్తుంటారు.ఓటర్లలో అవగాహన కల్పించడానికి పోలింగ్ శాతం పెంచడానికి అనేక రకాల ఏర్పాట్లు చేయడం మంచి చర్యనే. ప్రతీ పౌరుడు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నప్పుడే సమాజం మరింత గుణాత్మకంగా మారుతుంది. మంచి సమాజాన్ని నిర్మించుకోవడానికి ఓటుకు మించిన ఆయుధం ప్రజల చేతిలో మరొకటి లేదు. దానిని వినియోగించుకునే విధానాన్ని బట్టే సమాజాభివృద్ధి ఆధారపడి ఉంటుంది. శాసన మండలికి జరిగే వివిధ విభాగాలకు ప్రతినిధులు ఎంపిక అవుతారు. ఎంఎల్ఎ కోటా, గవర్నర్ కోటా, ఉపాధ్యాయ, పట్టభద్రుల కోటాలో ఎంఎల్‌సిలు ఎన్నికవుతారు. గవర్నర్ కోటాలో రాష్ట్ర కేబినెట్ నామినేట్ చేసిన వారికి ఆయా రంగాల్లో అర్హతను బట్టి గవర్నర్ తుది ఎంపిక చేస్తారు. ఇదిలా ఉంటే పట్టభద్రుల ఎంఎల్‌సి కోసం మాత్రం ప్రభుత్వాలు, ఎన్నికల కమిషన్ నిర్లక్ష్యం కన్పిస్తుందని చెప్పకతప్పదు. పట్టభద్రుల ఓట్ల నమోదును ఎన్నికల కమిషన్ చేపట్టకపోవడంతో పట్టభద్రులకు గంపగుత్తగా వివిధ ఎంఎల్‌సి పోటీదారులు దగ్గర ఉండి మరీ బృందాలను ఏర్పాటు చేసి ఓట్లు నమోదు చేస్తున్నారు.ఇదిలా ఉంటే స్వచ్ఛందంగా ఓటు హక్కు నమోదు చేసుకున్న పట్టభద్రులకు తమ ఓటును పచ్చ సంతకంతో ధ్రువీకరించుకోవాల్సిన పరిస్థితి ప్రస్తుతం ఉంది. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎన్నిక కోసం పట్టభద్రుల ఓటరు నమోదుకు ప్రభుత్వం ఈ నెల 6వ తేదిని ఆఖరు తేదిగా ప్రకటించింది. ఈ ఓటు హక్కు కోసం 2021లోపు డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని ప్రకటించింది. ఆయా పార్టీల అభ్యర్థులు, వ్యాపార సంస్థల



ఉండి పట్టభద్రులుగా ఎంఎల్‌సి స్థానం దక్కించుకోవాలనుకునే వారు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రత్యేకంగా ఓ సెల్ నెంబరు ఉంచి ఓటు నమోదు కోసం ప్రకటనలు చేసుకుంటున్నారు. వాస్తవానికి ఓటు హక్కును సులువుగా ఉపయోగించుకునేలా ప్రభుత్వమే చర్యలు తీసుకుంటే బాగుండేది. అలా కాకుండా చేయడం వల్ల అనేక మంది పట్టభద్రులు ప్రత్యేకంగా ఆన్‌లైన్ సెంటర్లకువెళ్లి ఓటు నమోదు చేసుకునేంత సమయం వెచ్చించడం లేదు. ఇక చాలా మంది పట్టభద్రులు వివిధ కారణాలతో వివిధ ప్రాంతాల్లో నివాదం ఉండేవారు మనకు ఎందుకులే అని ప్రత్యేకంగా ఓటు హక్కును నమోదు చేసుకునే పరిస్థితుల్లో లేరు.అయితే ఒకవేళ పట్టభద్రులుగా అవగాహన ఉండి సమాజంలో గుణాత్మక రాజకీయాల కోసం ఓటు హక్కు నమోదు చేసుకున్న వారికి ప్రభుత్వం పచ్చ సంతకంతో ధ్రువీకరణను కోరుతుంది. ప్రభుత్వం పట్టభద్రుల ఓటు నమోదు కోసం ఉంచిన వెబ్‌సైట్‌లో డిగ్రీ ధ్రువపత్రం, ఆధార్, ఓటర్ కార్డు నెంబరును నమోదు చేసినా మళ్లీ గెజిటెడ్ స్థాయి అధికారి సంతకంతో ధ్రువీకరించిన పత్రాలను తహసీల్దారు కార్యాలయంలో ఇవ్వాలనే షరతులు పట్టభద్రుల ఓటు ఆసక్తిని తగ్గించడమే అవుతుంది. ఒకవేళ ఇదే మంచి ఆలోచన అని ప్రభుత్వం భావించినప్పుడు ఆయా మండల స్థాయిలోనే ఒకరిద్దరు గెజిటెడ్ స్థాయి అధికారులను ఉంచి అక్కడే ఓటు హక్కును నమోదును ప్రభుత్వమే చేస్తే బాగుండేది.అలా కాకుండా అంతా ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా నమోదు ప్రక్రియ పూర్తి చేసుకున్న తరువాత తిరిగి ఆయా ధ్రువపత్రాలపై గెజిటెడ్ స్థాయి అధికారి సంతకంతో పత్రాలను ధ్రువీకరించుకొని సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో అందించాలని ఫోన్లలో మండల స్థాయి క్షేత్ర అధికారులు ఓటు నమోదు చేసుకున్న పట్టభద్రులకు సూచిస్తున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నది ఒక్క ఎత్తయితే ఇక గెజిటెడ్ అధికారి సంతకంతో ధ్రువీకరించుకోవడం మరో ఎత్తు. ఇలా పట్టభద్రులకు షరతులు పెట్టడం లాంటివి కాకుండా ప్రభుత్వమే పూర్తిగా పట్టభద్రుల ఓటు హక్కును నమోదు చేస్తే ఇటువంటి అనుమానాలకు, ఇబ్బందులు ఉండేవి కావు. నవంబర్ 6 చివరి గడువు ఉండడం, పట్టభద్రుని ఓటుకు పచ్చ సంతకం అవసరం కావాడం లాంటి షరతులతో ఓటు హక్కుకు పట్టభద్రులు నమోదుకు అంతగా ముందుకు రాకపోవచ్చు. ఈ విషయాన్ని అటు ఎన్నికల కమిషన్, ఇటు ప్రభుత్వం మరోసారి ఆలోచించాల్సిన అవసరం ఉంది.

# మరాఠా పీఠం ఎవరిదో!?



ముంబయి : దేశంలోని ఏ రాష్ట్రంలోనూ జరగని విధంగా మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికల సమరం సాగబోతోంది. ఈ ఎన్నికలలో ఆరు కీలక పార్టీలు తలపడుతున్నాయి. వీటిలో కాంగ్రెస్, బిజెపి జాతీయ పార్టీలు కాగా శివసేన, శివసేన (యుబిటి), ఎన్‌సిపి, ఎన్‌సిపి (శరద్ పవార్) ప్రాంతీయ పార్టీలు. అధికారంలో ఉన్న మహాయుతిలో బిజెపి 152, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 78, అజిత్ పవార్ నాయకత్వంలోని ఎన్‌సిపి 52 స్థానాలలో అభ్యర్థులను నిలిపాయి. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ)లో కాంగ్రెస్ 102, సేన (యుబిటి) 96, ఎన్‌సిపి(ఎస్‌పి) 87 స్థానాలకు పోటీ చేస్తున్నాయి. ఈ రెండు శిబిరాలూ తమ మిత్రపక్షాలైన చిన్న చిన్న పార్టీలకు కొన్ని స్థానాలను వదిలేశాయి. ప్రస్తుతానికి ఇరు పక్షాల పరిస్థితి నువ్వానేనా అన్నట్టుగా ఉందని రాజకీయ విశ్లేషకుడు అభరు దేశ్‌పాండే చెప్పారు.లోక్‌సభ ఎన్నికలలో ఎంవిఎకి అధిక స్థానాలు వచ్చినప్పటికీ రెండు కూటములకు వచ్చిన ఓట్ల శాతంలో తేడా స్వల్పమేనని అభరు తెలిపారు. మజ్లిస్, ప్రహార్ జనశక్తి పార్టీ (పిజెపి), వంచిత్ బహుజన్ అఘాడీ (విబిఎ), మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్‌ఎస్) వంటి పార్టీలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అవకాశాలు లేకపోలేదు. రాజ్ థాకరే నాయకత్వంలోని ఎంఎన్‌ఎస్ మహిమ్‌లో సేన (యుబిటి) ఓట్లకు, నాసిక్‌లో మహాయుతికి నష్టం చేకూర్చవచ్చునని దేశ్‌పాండే అంచనా. హిందూత్వ సంస్థల వేదికగా ఉన్న హిందూ సకాల్ సమాజ్ పలు ప్రాంతాలలో ర్యాలీలు నిర్వహిస్తోంది. ఈ సంస్థ కూడా ఎన్నికల ఫలితాలపై కొంతమేర ప్రభావం చూపే అవకాశం ఉంది.మహారాష్ట్రలో ఆరు ప్రాంతాలు, 36 జిల్లాలు ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం శాసనసభ స్థానాలు 288. ఏ ఒక్క పార్టీకీ రాష్ట్రవ్యాప్తంగా మద్దతు లేదు. ఒక్కో పార్టీకి ఒక్కో ప్రాంతంలో బలం ఉంది. ఈ ఎన్నికలలో పలు అంశాలు ప్రభావం చూపబోతున్నాయి. మరాఠాలు %-% ఒబిసిల మధ్య వివాదం, ఉల్లి రైతుల డిమాండ్లు, చెరకు పండించే ప్రాంతాలలో ఆందోళనలుఇవన్నీ ఓటర్లపై ప్రభావం చూపే అంశాలే. రాష్ట్రంలోని ఆరు ప్రాంతాలలో నెలకొన్న ఎన్నికల వాతావరణాన్ని ఒకసారి సింహావలోకనం చేసుకుంటే.

### పశ్చిమ మహారాష్ట్రలో

ఈ ప్రాంతంలో చెరకు తోటలు అధికంగా ఉన్నాయి. అవిభక్త ఎన్‌సిపి, కాంగ్రెస్ పార్టీలకు ఇక్కడ మంచి ఆదరణ ఉంది. ఈ ప్రాంతంలోని ఆరు జిల్లాలలో 70 శాసనసభ స్థానాలు ఉన్నాయి. పశ్చిమ మహారాష్ట్ర రాజకీయాలపై సహకార రంగం ప్రభావం ఎక్కువ. 1960 నుండి మహారాష్ట్రను పాలించిన 20 మంది ముఖ్యమంత్రులలో ఐదుగురు ఈ ప్రాంతం వారే. సీనియర్ నేత శరద్ పవార్‌ది కూడా పశ్చిమ మహారాష్ట్రే. 2014 వరకూ ఇక్కడ కాంగ్రెస్-ఎన్‌సిపి కూటమిదే హవా. గత శాసనసభ ఎన్నికలలో అవిభక్త ఎన్‌సిపి 27, కాంగ్రెస్ 12 స్థానాలు గెలుచుకోగా, బిజెపికి 20, శివసేనకు ఐదు స్థానాలు వచ్చాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో ఈ ప్రాంతంలోని మొత్తం 10 స్థానాలలో ఎంవిఎకు 8 సీట్లు లభించాయి. ఇప్పుడు శరద్ పవార్, ఆయన మేనల్లుడు అజిత్ పవార్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. బిజెపి నుండి సీనియర్ నేతలను ఆకర్షించడంలో శరద్ పవార్ విజయం సాధించగలిగారు. రాబోయే శాసనసభ ఎన్నికలలో అజిత్ పవార్ నాయకత్వంలోని ఎన్‌సిపి ఏ మేరకు ప్రభావం చూపుతుందో వేచి చూడాల్సి ఉంది. పశ్చిమ ప్రాంతంలో నెలకొన్న వ్యవసాయ సంక్షోభాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవాలని ప్రతిపక్ష ఎంవిఎ ప్రయత్నిస్తోంది.

### ఉత్తర మహారాష్ట్రలో

ఈ ప్రాంతంలోని నాలుగు జిల్లాలలో కలిపి 35 శాసనసభ స్థానాలు ఉన్నాయి. ఇక్కడ గిరిజనులు, ఓబీసీలు అధికంగా ఉంటారు. ఓబీసీల ఓట్లు సంఘటితం కావడంతో గతంలో బిజెపి లబ్ది పొందగలిగింది. ఉల్లి పండించే రైతులలో పెల్లుబుకుతున్న ఆగ్రహం మహాయుతిని దెబ్బతీసే అవకాశాలు కన్పిస్తున్నాయి. గత లోక్‌సభ ఎన్నికలలో బిజెపికి కేవలం రెండు స్థానాలు మాత్రమే వచ్చాయి. కాంగ్రెస్‌కు రెండు, ఎన్‌సిపి (పవార్), శివసేన (యుబిటి)లకు ఒక్కో స్థానం దక్కాయి. గత శాసనసభ ఎన్నికలలో బిజెపికి 13 సీట్లు లభించాయి. ఎన్‌సిపి 7, సేన 6, కాంగ్రెస్ 5 స్థానాలు గెలుచుకున్నాయి. ఉత్తర మహారాష్ట్రలో మజ్లిస్ పార్టీకి రెండు స్థానాలు వచ్చాయి.గత సంవత్సరం డిసెంబరులో ఉల్లి ఎగుమతులపై విధించిన నిషేధాన్ని ఈ మేలో తొలగించారు. ఉల్లిపై ఎగుమతి సుంకాన్ని 40 శాతం నుండి 20 శాతానికి తగ్గిస్తూ కేంద్రం గత సెప్టెంబరులో నిర్ణయం తీసుకుంది. ఈ అంశాలు ఓటర్లపై ప్రభావం చూపవచ్చు. గిరిజన ఓటర్లు%ా%ముఖ్యంగా నాసిక్‌లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. లోక్‌సభ ఎన్నికలలో వీరంతా ఎంవీఏకు బాసటగా నిలిచారు.

### థానే, కొంకణ్‌లో

ఐదు జిల్లాలలో విస్తరించి ఉన్న కోస్తా ప్రాంతంలో 39 శాసనసభ స్థానాలు ఉన్నాయి. ఇక్కడ బాల్ థాకరే నేతృత్వంలోని అవిభక్త శివసేన ప్రభావం ఎక్కువే. థానే ప్రాంతంలో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు గట్టి పట్టుంది. ఈ ప్రాంతంలో కూడా మహాయుతి ప్రభుత్వం భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై ఆశలు పెట్టుకుంది. ఆయా ప్రాజెక్టులపై స్థానికులలో నెలకొన్న అసమ్మతిని సొమ్ము చేసుకోవడానికి ఎంవిఎ ప్రయత్నిస్తోంది. రాజ్‌కోట్ కోటలో ఛత్రపతి శివాజీ విగ్రహం కూలిన ఘటనపై ప్రతిపక్షం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. దీనిని ఎన్నికల ప్రచారాంశంగా వాడుకోవాలని అది భావిస్తోంది. గతంలో శివసేనకు కంచుకోటలుగా ఉన్న కొంకణ్, రత్నగిరి, సింధుదుర్గ్‌లో కాలూనాలని బిజెపి ప్రయత్నిస్తోంది.

### ముంబయిలో

కొన్ని దశాబ్దాలుగా ముంబయి, దాని పరిసర జిల్లాలలో అవిభక్త శివసేనకు మంచి పట్టుంది. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌పై శివసేన పాతిక సంవత్సరాల పాటు అప్రతిహతంగా ఆధిపత్యం చెలాయించింది. ముంబయి జనాభాలో 28-30 శాతం మంది మరాఠీలే. గుజరాతీలు 19 శాతం ఉండగా, ఉత్తర ప్రదేశ్, బీహార్, కర్ణాటక, రాజస్థాన్ నుండి వలస వచ్చిన వారు మరో 40 శాతం వరకూ ఉంటారు. ఈ ప్రాంతంలో 36 శాసనసభ స్థానాలు ఉన్నాయి. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పేరుతో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రతిపక్ష ఎంవిఎకు ధారవి పునరభివృద్ధి ప్రాజెక్ట్ ఎన్నికల అస్త్రంగా మారింది. ఈ ప్రాజెక్టు కాంట్రాక్టును అదానీ గ్రూప్ దక్కించుకున్న విషయం తెలిసిందే.

# కస్తూరిపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి డిమాండ్

చెన్నై, తెలుగు ప్రజలను ఉద్దేశించి సినీ నటి కస్తూరి చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వేడి ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. రెండు కోట్ల మందికి పైగా తెలుగు ప్రజలను కించపరుస్తూ, అవమానించేలా మాట్లాడి, వారి మనోభావాలను దెబ్బతీసిన నటి కస్తూరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎంకే ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి ఎ.రాజాతో పాటు పలు తెలుగు సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. అదేసమయంలో నటి కస్తూరిపై చెన్నై, మదురై పోలీస్ కమిషనరేట్ కార్యాలయాల్లో ఫిర్యాదులు కూడా చేశారు. ఇటీవల నగరంలో జరిగిన బీజేపీ రాష్ట్ర సీనియర్ నేతలు అర్జున్ సంపత్, గురుమూర్తి కలిసి సనాతన ధర్మ పరిరక్షణ పేరుతో ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న నటి కస్తూరి ప్రసంగిస్తూ రాజుల వద్ద అంతఃపుర మహిళలకు సేవ చేసేందుకు తెలుగు ప్రజలు వచ్చారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. వీటిపై పెను దుమారం రేగడంతో ఆమె వివరణ కూడా ఇచ్చారు. అయినప్పటికీ.. నిరసనజ్వాల చల్లారలేదు. ఈ విషయంపై తమిళగ నాయుడు మహాజన సంఘం ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి శృతి రమేష్, బోస్, రామమోహన రావు పాసరై తరపున ప్రభు కలిసి మదురై పోలీస్ కమిషనర్ లోకనాథన్‌కు వినతి పత్రం సమర్పించి, కస్తూరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, సేలంలో దేశీయ తెలుంగార్ మైనార్టీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నాగ అరవిందన్ కూడా సినీ నటిపై చర్య తీసుకోవాలని చెన్నై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు వెల్లడించారు. నగరానికి చెందిన సంఘ సేవకురాలు వీరలక్ష్మి కూడా చెన్నై పోలీస్ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేశారు. తెలుగు ప్రజల మనోభావాలను కించపరిచేలా మాట్లాడటమే కాకుండా ఎన్నో దశాబ్దాలుగా సోదరభావంతో మెలుగుతున్న తమిళ, తెలుగు ప్రజల మధ్య చిచ్చుపెట్టేలా నటి కస్తూరి వ్యాఖ్యలు చేశారన్నారు.రెండు భాషలకు చెందిన ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేలా మాట్లాడినందుకు కస్తూరిపై కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎంకే ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి ఎ.రాజా మాట్లాడుతూ.. నటి కస్తూరి కేవలం తెలుగు ప్రజలను మాత్రమే కాకుండా, మహళలను కూడా కించపరిచేలా మాట్లాడారని, ఈ తరహా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అణగారిన వర్గాలకు చెందిన ప్రజలను నేరస్థులుగా చిత్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్రావిడ పాలనలో ఆర్య ఆధిపత్యాన్ని సహించే ప్రసక్తే లేదని రాజా స్పష్టం చేశారు.

# ఆక్రమించుకున్న భూములపై విచారణకు సీఎం పవన్ ఆదేశం

అమరావతి, ఏపీలోని పల్నాడు జిల్లాలో వైఎస్ జగన్ కుటుంబీకులు సరస్వతి సిమెంట్ కంపెనీ పేరుతో ఆక్రమించుకున్న భూములపై విచారణ చేపట్టాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. మాచవరం, వేమవరం,చెన్నాయపాలెంలో మంగళవారం సరస్వతి భూములను పరిశీలించారు. దాదాపు అరగంట పాటు భూములు పరిశీలించిన అనంతరం ఆయన స్థానిక ప్రజలతో మాట్లాడారు. సరస్వతి కంపెనీకి భూములు ఇవ్వబోమన్న వారిపై పెట్రోలు బాంబులు వేసి భయపెట్టి భూములు లాక్కున్నారని ఆరోపించారు. అటవీ భూములను ఆక్రమించుకున్నారని, దళితుల భూములను ఇష్టారాజ్యంగా లాక్కున్నారని పేర్కొన్నారు, చెరువులు, కుంటలను సైతం రెవెన్యూ భూములుగా చిత్రీకరించి వాటిని స్వాధీనం చేసుకున్నారని విమర్శించారు. రైతులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి కొనుగోలు చేసిన భూములకు ఇంతవరకు పరిహారం ఎందుకు అందించలేదని ప్రశ్నించారు. సిమెంట్ కంపెనీకి పర్యావరణ అనుమతులు కూడా లేవని ,30 సంవత్సరాలు లీజును సీఎం జగన్ అయ్యాక 50 సంవత్సరాలకు మార్చుకున్నారని దుయ్యబట్టారు. కట్టని సిమెంట్ కంపెనీకి 198 కోట్ల లీటర్ల కృష్ణ జలాలు మళ్లింపు కోసం రాసుకున్నారని ఆరోపించారు. సిమెంట్ కంపెనీని ఎందుకు చేపట్టలేదని, పరిహారం ఎందుకు అందించలేదు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం బాధితులకు అండగా ఉండేందుకు వచ్చామని తెలిపారు. రైతులను బెదిరించిన వారిపై పోలీసులు ఉపేక్షించవద్దని అన్నారు. మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావును వేధించి చంపారని విమర్శించారు.

# టెండర్ల రద్దు..

హైదరాబాద్, తెలంగాణలో నీటిపారుదల శాఖ నిర్ణయాలు వివాదాస్పదంగా తయారయ్యాయి. సీతారామ ఎత్తిపోతల టెండర్లలోని అక్రమాలు ఇరిగేషన్ శాఖను కుదిపేస్తున్నాయి. ఆర్థికపరమైన అనుమతి లేకుండా వెయ్యి కోట్లతో చేపట్టిన ఈ టెండర్లు ఎవరి మెడకు చుట్టుకుంటాయన్న బెంగ ఇంజినీర్లను కుంగదీస్తోంది. ఈ మేరకు ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీల టెండర్లపై వివాదాలు రేగుతుండగా.. పాలనాపరమైన, ఆర్థికపరమైన అనుమతులు లేకుండానే పనులు జరిగాయన్న దుమారం రేగుతోంది. కమిషనరేట్ ఆఫ్ టెండర్స్ కమిటీ ఆమోదముద్ర లేని ఈ పనులు రద్దయ్యే అవకాశం ఉందనే ప్రచారం సైతం ఊపందుకుంది. రూ.10 కోట్లు పైబడి విలువ చేసే పనుల టెండర్ల ఖరారుకు సీవోటీ కమిటీ ఆమోదం అవసరముండగా.. సాంకేతిక, పాలనాపరమైన, ఆర్థికపరమైన అనుమతులు ఉంటేనే పనులకు సీవోటీ ఆమోదం తెలిపే అవకాశం ఉంది.

### రూ.1842 కోట్ల అంచనాలతో టెండర్లు..

ఈ మేరకు సీతారామ ఎత్తిపోతల పనుల్లో ఇరిగేషన్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నీళ్లొదిలారనే వివాదం తెలంగాణలో చర్చనీయాంశమైంది. ఎత్తిపోతల నిర్మాణానికి రూ.1842 కోట్ల అంచనాలతో అధికారులు టెండర్లు ఆహ్వానించగా.. ఇందులో సుమారు రూ. 768 కోట్లు విలువ చేసే పనులకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. మిగతా రూ.1074 కోట్ల విలువైన పనులకు సంబంధించిన అనుమతులను ఆర్థిక శాఖ పెండింగ్‌లో పెట్టింది. అందువల్లే ఇరిగేషన్ శాఖ పాలనా పరమైన అనుమతులు జారీ చేయలేకపోయింది. కొత్తగూడెం సీఈ నేతృత్వంలో సీతారామ ఎత్తిపోతల టెండర్లపై మంత్రుల ఎదుటే నిలదీసిన సీఈ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో సీతారామ టెండర్లకు సీవోటీ కమిటీ ఆమోదం లేదంటూ ఇంజినీర్లు కుండబద్దలు కొట్టారు.

### ఎవరి అండతో సీఈ రెచ్చిపోతున్నారు..

కొత్తగూడెం చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలోని అధికారులు టెండర్లు పిలవడం విమర్శలకు దారితీసింది. ఈ టెండర్లపై నిలదీసిన ఈఎన్‌సీపై.. కొత్తగూడెం సీఈ రెండుసార్లు ఏకవచనంతో విమర్శలు చేయడం సంచలనం సృష్టించింది. మంత్రులు తుమ్మల, ఉత్తమ్ ఎదుటే ఆయన రెచ్చిపోవడం మరింత దుమారం రేపుతోంది. ఎవరి అండతో సీఈ రెచ్చిపోతున్నారన్న అంశం ఇరిగేషన్ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది.

## ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడటం గర్వంగా ఉంది

అమరావతి,ఆస్ట్రేలియా జరుగుతున్న 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్‌కు ఏపీ బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్‌లో ఎంపీ పలు అంశాలను ప్రస్తావించారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) సదస్సులో ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ పార్లమెంటరీ దేశాల ప్రతినిధులతో కలిసి ఉండటం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ సదస్సులో అర్థవంతమైన చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. మహిళా సాధికారత కోసం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశంలో చేపడుతున్న సానుకూల, ఖచ్చితమైన అంశాలను సవివరంగా వివరించడానికి ఈ సదస్సు ద్వారా మంచి అవకాశం దొరికిందని వెల్లడించారు. 8వ తేదీ వరకు కాన్ఫరెన్స్ చర్చల్లో పాల్గొంటామని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. కాగా.. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరిగే 67వ కామన్‌వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్(సీపీసీ)లో పాల్గొనేందుకు కామన్వెల్త్ మహిళా పార్లమెంటరీ స్టీరింగ్ కమిటీ చైర్‌పర్సన్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి శనివారం (నవంబర్ 2) బయలుదేరి వెళ్లారు. ఈ కాన్ఫరెన్స్‌లో 50కిపైగా దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.. అలాగే మన దేశం నుంచి ఎంపీ పురందేశ్వరి హాజరయ్యారు. మహిళల సమస్యలు, చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెంపు తదితర అంశాలపై ఈ సమావేశాల్లో చర్చిస్తారు. ఆస్ట్రేలియాలో జరిగే ఈ సమావేశాల్లో పాల్గొని తిరిగి నవంబర్ 11న ఎంపీ పురందేశ్వరి తిరిగి స్వదేశానికి రానున్నారు. బీజేపీ ఏపీ అధ్యక్షురాలు, బీజేపీ సభ్యత్వ నమోదుకు సంబంధించి కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల ఇంఛార్జిగా వ్యవహరిస్తున్న ఎంపీ పురందేశ్వరిని ఇండియా రీజియన్ ప్రతినిధిగా కామన్వెల్త్ మహిళా పార్లమెంటరీ స్టీరింగ్ కమిటీ సభ్యురాలిగా నామినేట్ అయ్యారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓ బిర్లా ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈనెల 2న ఆస్ట్రేలియాకు వెళ్లిన పురందేశ్వరి 10వ తేదీ వరకు ఆస్ట్రేలియాలో జరిగే సమావేశాల్లో పాల్గొని తిరిగి 11న మన దేశానికి చేరుకోనున్నారు. అలాగే ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కూడా నవంబర్ 3న ఆస్ట్రేలియాకు వెళ్లారు. 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ (సీపీసీ)లో పాల్గొనేందుకు ఆయన ఆదివారం సిడ్నీ నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఎన్ఆర్ఐలు ఎయిర్‌పోర్ట్‌లో స్పీకర్‌కు ఘనస్వాగతం పలికారు. అయ్యన్న వెంట కుమారుడు చింతకాయల రాజేశ్, శాసనసభ కార్యదర్శి ప్రసన్నకుమార్ సూర్యదేవర ఉన్నారు.

## ఆర్థికాభివృద్ధి డొల్ల

న్యూఢిల్లీ,ఆర్థికాభివృద్ధిలో భారతదేశం ఏడు శాతం వృద్ధితో ప్రపంచంలోనే అగ్రగామి గా ఉందని మోడీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంటున్నా ..90 శాతం మంది ప్రజలకు దీని ప్రయోజనాలు అందడం లేదన్నది కఠోర వాస్తవం. ప్రజలు ఎదుర్కొంటున్న అసలైన ధరల పెరుగుదల ప్రభుత్వ గణాంకాలకు అందనంతగా ఉందన్నది మరో వాస్తవం. భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొం టోందని వివిధ ప్రభుత్వ శాఖలు ఇటీవల విడుదల చేసిన వివిధ గణాంకాలు విదితం జేస్తున్నాయి. రూపాయి విలువ క్షీణించడం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, స్టాక్ మార్కెట్ నుండి విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, విపరీతమైన విదేశీ రుణాలు, విదేశీ వాణిజ్యలోటు వంటివి మన ఆర్థిక వ్యవస్థ దుస్థితిని వెల్లడించడమే కాదు.. క్షీణతను సూచిస్తున్నాయి. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి అత్యధికంగా నష్టపోయింది. డాలర్ విలువ రూ.84.07 పైసలు. ఆ మారకపు విలువను కొనసాగించేందుకు రిజర్వ్ బ్యాంక్ తన నిల్వల నుంచి పెద్ద మొత్తంలో డాలర్లను విడుదల చేస్తోంది. ఇది విదేశీ మారక నిల్వలను కూడా తగ్గిస్తుంది. మోడీ ప్రభుత్వం 2014 మేలో అధికారంలోకి వచ్చినప్పుడు డాలర్ మారకం విలువ రూ.59.44 పైసలు కాగా పదేళ్లలో దాదాపు రూ.25 పడిపోయి రూ.84కి దిగజారింది. విదేశీ వాణిజ్య లోటు కూడా పెరుగుతోంది. ఆగస్టులో వాణిజ్య లోటు 2,970 డాలర్లకు పెరిగింది. గతేడాది ఆగస్టులో ఇది 2,421 కోట్లు. భారతదేశ ఎగుమతులు చాలా బలహీన స్థితిలో ఉన్నాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణం ప్రజల కొనుగోలు శక్తిని కూడా తగ్గిస్తుంది. భారత ఆర్థిక వ్యవస్థ స్థిరత్వంపై విదేశీ పెట్టుబడిదారులు విశ్వాసం కోల్పోయారు. విదేశీ మదుపరులు తమ పెట్టుబడులను భారతీయ స్టాక్ మార్కెట్ నుంచి ఉపసంహరించు కుంటున్నారు. విదేశీ మదుపరులు ఈ నెలలో ఇప్పటివరకు రూ.85,000 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో, భారతీయ కంపెనీల ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండడంతో విదేశీ పెట్టుబడిదారులు దూరమవుతున్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు చైనా ఉద్దీపన ప్యాకేజీని ప్రకటించడం భారత మార్కెట్‌ను కూడా తాకింది. ప్రపంచ ఆర్థిక మాంద్యం కారణంగా 2008లో భారతీయ స్టాక్ మార్కెట్ నుండి విదేశీ పెట్టుబడులు ఉపసంహరించబడ్డాయి. అప్పట్లో అది పెద్ద ప్రభావం చూపింది. రూపాయి విలువ క్షీణతకు అది కూడా కారణమైంది. సెప్టెంబర్‌లో వస్తు, సేవల పన్ను వసూళ్లే ఇందుకు నిదర్శనం. 40 నెలల్లో అత్యల్ప వృద్ధి రేటు (–) 6.5 శాతం నమోదైంది. ప్రస్తుత ద్రవ్యోల్బణం రేటుతో పోలిస్తే సెప్టెంబర్‌లో జీఎస్‌టి ఆదాయం పెద్దగా పెరగలేదు. బొగ్గు, విద్యుత్, ముడి చమురు ప్రాసెసింగ్, మైనింగ్ వంటి ఎనిమిది కీలక రంగాల్లో ఉత్పత్తిపై ఆధారపడిన పారిశ్రామికోత్పత్తి సూచీ ఆగస్టులో ప్రతికూల వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాదితో పోలిస్తే సెప్టెంబర్‌లో కార్ల విక్రయాలు 19 శాతం తగ్గాయి. సేవల రంగ సూచీ కూడా 10 నెలల కనిష్టానికి చేరింది. ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో గృహ రుణాల పంపిణీ తొమ్మిది శాతం పడిపోయింది. బలమైన మరియు చలనశీలమైన ఆర్థిక వ్యవస్థకు అవసరమైన ఇటువంటి అంశాలు క్షీణిస్తున్నాయి. పేలవమైన ఆర్థిక విధానాల ఫలితంగా మధ్యతరగతి, దిగువ తరగతులవారి ఆదాయం తగ్గింది. దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కొనుగోలు శక్తి లేకపోవడం. కొనుగోలు శక్తి కోవిడ్ పూర్వ స్థాయికి చేరుకోలేదని చాలా సూచికలు చూపిస్తున్నాయి. కొనుగోలు శక్తిని పెంచుకోవాలంటే దిగువన ఉన్న 50 శాతం మంది చేతిలో ఎక్కువ డబ్బు రావాలి. కానీ కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, ఇతర సంక్షేమ పథకాల కేటాయింపులు పెంచడం లేదు. దానికి బదులుగా, కార్పొరేట్ లకు పన్ను మినహాయింపులతో సహా భారీ సబ్సిడీలు ఇస్తోంది. మాంద్యం నుంచి ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు ప్రత్యేక ప్యాకేజీలను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం కావాలి. పెరుగుతున్న నిరుద్యోగం, వేతన పెరుగుదల లేకపోవడం ప్రజల కొనుగోలు శక్తిని క్షీణింపజేసింది. ఏడు శాతం వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ స్తబ్దుగా ఉందనడానికి ఇంతకన్నానిదర్శనం అక్కర్లేదు.

## టీటీడీ పాలక మండలి చైర్మన్‌గా బీఆర్ నాయుడు

అమరావతి,టీటీడీ పాలక మండలి 54వ చైర్మన్‌గా బీఆర్ నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. బీఆర్ నాయుడు, 16 మంది పాలక మండలి సభ్యులతో ఈవో శ్యామలరావు ప్రమాణం చేయించారు. అనంతరం వారంతా శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో టీటీడే అధికారులు స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.

# అతివాద శక్తులకు కెనడా అండ



సెంట్రల్ డెస్క్:కెనడాలోని హిందువులు తమ మతవిశ్వాసాలను సురక్షితంగా పాటించేందుకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది. ఇండో –కెనడా సమాజం లేకపోతే కెనడాలో దీపావళి సంబరాలు లేవు'– మొన్న దీపావళి పండుగ సందర్భంగా ఓ హిందూ దేవాలయాన్ని సందర్శించిన అనంతరం కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన వ్యాఖ్యలివి. ఇది జరిగిన మూడు రోజులకే బ్రాంప్టన్ లోని హిందూ దేవాలయంపై ఖలిస్థానీ వేర్పాటువాదులు దాడి చేసి, పలువురు భక్తులను గాయపరిచారు.ఈ సంఘటన కెనడాలో నివాసం ఉంటున్న హిందువులపట్ల, వారి ప్రార్థనా మందిరాల రక్షణ పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి ఏపాటిదో తేటతెల్లం చేస్తోంది. అంతకుమించి, హిందువులపై వల్లమాలిన ప్రేమ ఒలకబోస్తున్న ప్రధాని ట్రూడో మాటలకు, చేతలకు పొంతన లేదని రుజువు చేస్తోంది. టొరంటోకు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్రాంప్టన్‌లోని హిందూ దేవాలయం పై సిక్కు వేర్పాటువాదులు ఖలిస్థానీ జెండాలను చేతపట్టి సృష్టించిన విధ్వంసం సభ్యసమాజాన్ని నిశ్చేష్టుల్ని చేసింది. ఆమాటకొస్తే, ఖలిస్థానీ వేర్పాటువాదులు అక్కడి హిందూ ఆలయాలను లక్ష్యంగా చేసుకోవడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ ఇలాంటి దాడులు జరిగిన దాఖలాలు ఉన్నా ఆలయాలకు కట్టుదిట్టమైన భద్రత కల్పించడంలో ట్రూడో నేతృత్వంలోని ప్రభుత్వ పెద్దలు నిర్లక్ష్యం వహిస్తున్నారనడానికి తాజా ఉదంతమే ఉదాహరణ.భారత రాయబార కార్యాలయం బ్రాంప్టన్ ఆలయంలో ఏర్పాటు చేసుకున్న సమావేశాన్ని విచ్ఛిన్నం చేయడం, హిందూ భక్తులలో భయాందోళనలు రేకెత్తించడమే లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఈ దాడిని ఖండించిన ప్రధాని ట్రూడో సంఘటనకు సంబంధించిన బాధ్యుల గురించి గానీ, అరెస్టుల గురించి గానీ ప్రస్తావించకపోవడం గమనార్హం. ఖలిస్థానీ వేర్పాటువాదులకు ప్రభుత్వం ఇచ్చిన అపారమైన స్వేచ్ఛ కారణంగానే ఈ దాడి జరిగిందంటూ హిందూ ఎంపి చంద్ర ఆర్య మండిపడ్డారు. కెనడాలో ఖలిస్థానీ తీవ్రవాదం ఏ స్థాయికి చేరిందో చెప్పడానికి ఈ దాడే ఒక ఉదాహరణ అంటూ దాడికి సంబంధించిన వీడియోలను ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఈ దాడి వెనుక భారత వ్యతిరేక శక్తుల హస్తం ఉందంటూ ఒట్టావాలోని భారత రాయబారి కార్యాలయం సైతం ఆరోపించింది.జరిగిన సంఘటనను భారత ప్రధాని పిరికిపంద చర్యగా అభివర్ణిస్తూ, కెనడా ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆశిస్తున్నానని అన్నారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తమ దేశంలో అధిక సంఖ్యలో ఉన్న సిక్కుల మద్దతు కోసం ట్రూడో పాకులాడుతున్నారు. గత మూడు పర్యాయాలుగా అధికారంలో ఉన్న లిబరల్ పార్టీని ఇటీవలి కాలంలో వరుస వివాదాలు చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నిజ్జర్ హత్య కేసులో ఇండియాతో కోరి తెచ్చుకున్న వివాదంలో సాక్ష్యాలు చూపించలేక ట్రూడో ప్రభుత్వం నీళ్లునములుతున్న సంగతి తెలిసిందే. దీనికితోడు గోరుచుట్టుపై రోకటిపోటులా సిక్కులకు చెందిన న్యూ డెమొక్రాటిక్ పార్టీ (ఎన్‌డిపి) సంకీర్ణ ప్రభుత్వానికి ఇటీవల మద్దతు ఉపసంహరించుకుంది.అయితే ముందే కుదిరిన ఒప్పందం ప్రకారం వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికలవరకూ అధికార లిబరల్ పార్టీకి మద్దతు ఇస్తామన్న తమ ఒప్పందాన్ని గౌరవిస్తూ, ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టబోమని ఎన్‌డిపి అధినేత జగ్మీత్ సింగ్ హామీ ఇవ్వడంతో ట్రూడో ఊపిరి పీల్చుకున్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఇళ్ల సమస్య వంటివి అధికార పార్టీ ప్రతిష్ఠను దిగజార్చాయి. వచ్చే ఏడాది అక్టోబర్లో జరిగే ఎన్నికల్లో లిబరల్ పార్టీ గట్టెక్కడం కష్టమేనంటూ సర్వేలు ఘోషిస్తున్న తరుణం లో సిక్కులను మచ్చిక చేసుకునేందుకు సందర్భం వచ్చినప్పుడల్లా భారత ప్రభుత్వంపై ట్రూడో విషం కక్కుతున్నారు. ఒక క్రిమినల్ కేసులో భారత హై కమిషనర్‌కు ప్రమేయం ఉందని నిరూపించేందుకు కెనడా ప్రభుత్వం సిద్ధపడటంతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి.ఇది చాలదన్నట్లు తాజాగా తమ దేశానికి ఇండియా నుంచి సైబర్ దాడుల ముప్పు ఉందంటూ కెనడా కొత్త పల్లవి ఎత్తుకుంది. భారత ప్రభుత్వ ప్రాయోజిత వ్యక్తులు సైబర్ దాడులకు పాల్పడే ప్రమాదం ఉన్నదని జాతీయ సైబర్ ముప్పుపై వెలువరించిన ఓ అధ్యయనం పేర్కొనడాన్ని చేతికి అంది వచ్చిన ఆయుధంగా ట్రూడో భావిస్తున్నారు. ఆధారాలు లేకుండా ఇండియాపై ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్న కెనడా, భారత్‌కు వ్యతిరేకంగా ప్రపంచ దేశాల అభిప్రాయాన్ని మార్చేందుకు పడరాని పాట్లు పడుతోంది. అధికారాన్ని నిలబెట్టుకునేందుకు అతివాద శక్తులను వెనకేసుకు వస్తున్న జస్టిన్ ట్రూడో వైఖరిలో మార్పు రాకపోతే, భారత –కెనడా సంబంధాలు మరింతగా విషమించే ప్రమాదముంది.

# ఎదురుదెబ్బలను తట్టుకుని పైకిలేచి రెండోసారి వైట్‌హౌజ్‌కు..

వాషింగ్టన్:కొందరు ఆయన్ను ప్రేమిస్తారు.. మరికొందరు ఆయన్ను ద్వేషిస్తారు.. కానీ ఆయన్ను విస్మరించడం మాత్రం ఎవరి వల్లా కాదు.. ఆయనే డొనాల్డ్ ట్రంప్. అమెరికా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రెండు సార్లు అభిశంసనకు గురైన మిస్టర్ ట్రంప్..రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ వైట్ హౌస్ లోకి అడుగు పెట్టబోతున్నారు. విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆరోపిస్తూ గతంలో ట్విట్టర్ ఆయన్ను వెలివేసింది.. 2020 అమెరికా ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఓడిపోయిన తర్వాత ఆయన పడిన పాట్లు అన్నీఇన్నీ కావు.. అయినా ఎక్కడా వెనక్కి తగ్గలేదు.. తలదించలేదు.. వెన్నుచూపని వీరుడిలా మరోసారి అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచారు. ఎదురుగా బలమైన ప్రత్యర్థి కమల హారీస్ ఉన్నా ఏ మాత్రం బెదరలేదు... వణకలేదు..! డొంక తిరుగుడు మాటలు ఏ మాత్రం తెలియని ట్రంప్.. తన ముక్కుసూటితనంతోనే ఓటర్ల మనసును గెలిచి 47వ ప్రెసిడెంట్‌గా 2025 జనవరి 20న రెండోసారి ప్రమాణస్వీకారానికి సిద్ధమయ్యారు. పడి చోటే లేచిన ట్రంప్ తన జీవిత ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూశారు. రెండోసారి వైట్ హౌస్ లోకి గ్రాండ్ ఎంట్రీ ఇవ్వబోతున్నారు బిలియనీర్ ట్రంప్

నేపథ్యం..

డొనాల్డ్ ట్రంప్ జూన్ 14, 1946న న్యూయార్క్‌లోని ఓ సంపన్న కుటుంబంలో పుట్టారు.ట్రంప్ తండ్రి ఫ్రెడ్ విజయవంతమైన రియల్ ఎస్టేట్ వ్యాపారి. న్యూయార్క్‌తో పాటు అమెరికాలోని వివిధ నగరాల్లో ట్రంప్ కుటుంబానికి చాలా అపార్ట్‌మెంట్లు, ఆస్తులు ఉన్నా...ట్రంప్ జీవితం ఏమాత్రం సాఫీగా సాగలేదు. ఆయన కుటుంబానికి ఉన్న డబ్బే ట్రంప్‌కు స్కూల్‌లో శాపంగా మారింది. ట్రంప్‌ను చాలా మంది వేరుగా చూసేవారు. అందరిలో ఒకడిలా ట్రంప్‌ని ఉండనివ్వలేదు. ఇదే ఆయన్ను స్కూల్‌లో క్రమశిక్షణ తప్పేలా చేసింది. పదేపదే స్కూల్ టీచర్ల నుంచి కంప్లైంట్ వస్తుండడంతో ట్రంప్‌ను మిలటరీ స్కూల్‌కు పంపారు తల్లిదండ్రులు. అక్కడే ట్రంప్‌కు డిసిప్లేన్ అలవాటైంది. అయితే అదే స్కూల్ ఆయన్ను తల్లిదండ్రుల నుంచి దూరంగా పెరిగేలా చేసింది. అటు తండ్రి ఫ్రెడ్ కూడా చాలా స్ట్రిక్ట్. దీంతో ట్రంప్ బాల్యం ఆంక్షలు మధ్య ఏ మాత్రం స్వేచ్ఛ లేనట్టే గడిచింది.

వ్యాపారవేత్తగా..

చదువులు పూర్తి చేసిన తర్వాత ట్రంప్ తన తండ్రి లాగే రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి వెళ్లారు. తండ్రిలా కాకుండా వ్యాపారంలో రిస్క్ చేయాలన్నది ట్రంప్ ఆలోచన. బోల్డ్‌గా ఎన్నో నిర్ణయాలు తీసుకుంటూ ముందుకెళ్లిన ట్రంప్ చాలాసార్లు వ్యాపారంలో ఘోరంగా దెబ్బతిన్నారు. 1980లలో విలాసవంతమైన భవనాలు, హొటళ్ళు, కాసినోలలో భారీగా పెట్టుబడి పెట్టారు. అయితే 1990ల ప్రారంభంలో అమెరికాను చుట్టేసిన మాంద్యం ట్రంప్ కు నష్టాలను తెచ్చిపెట్టింది. భారీ అప్పులు ఆయన నెత్తిమీద వచ్చి పడ్డాయి. కొన్నాళ్లపాటు దివాలా అంచు వరకు ఉన్న ట్రంప్ 2000వ సంవత్సరం తర్వాత కోలుకున్నారు. నాడు రియాలిటీ టీవీ షోలలో కనిపించి మెరిశారు. ది అప్రెంటిస్ అనే బిజినెస్ పోటీ షోతో ప్రజలకు దగ్గరయ్యారు . ఈ ప్రొగ్రామ్‌లో 'యు ఆర్ ఫైర్' అని ట్రంప్ చెప్పే డైలాగ్ నాడు అమెరికాలో మారుమోగింది. ఇలా తనకంటూ ఓ సపరేట్ బ్రాండ్ క్రియేట్ చేసుకున్న ట్రంప్ మరోసారి విజయవంతమైన వ్యాపారవేత్తగా మారారు.

రాజకీయాల్లోనూ..

ఇలా 2015 వరకు వివిధ వ్యాపారాల్లో బిజీగా ఉన్న ట్రంప్ అదే సంవత్సరం నుండి ఎవరూ ఊహించని విధంగా రాజకీయాల్లో యాక్టివ్ అయ్యారు.రిపబ్లికన్ పార్టీ నుంచి అధ్యక్ష అభ్యర్థిగా నామినేషన్ వేస్తానని ట్రంప్ చెప్పినప్పుడు అంతా నవ్వారు. పిచ్చోడు ఏదో మాట్లాడుతున్నాడని ఎగతాళి చేసినవారు కూడా ఉన్నారు. అయితే ట్రంప్ ఎవరి మాటలు పట్టించుకోలేదు.. చేయాల్సింది చేశారు.. నామినేషన్ వేయడమే కాదు.. 2016ఎన్నికల్లో గెలిచి అమెరికా 45వ అధ్యక్షుడిగా వైట్ హౌస్ మెట్లెక్కారు. అధ్యక్షుడిగా ఎన్నికయ్యారే కానీ ఎన్నో సమస్యలు ఆయన్ను చుట్టుముట్టాయి. ఎన్నో వివాదాల్లో ఆయన చిక్కుకున్నారు. వివిధ అంశాల్లో ఆయన విధానాలు తీవ్ర చర్చకు దారితీశాయి. ముఖ్యంగా ఇమ్మిగ్రేషన్ విధానాలను మానవ హక్కుల సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ముస్లిం వ్యతిరేకి అంటూ దుయ్యబట్టాయి. అంతేకాదు



అనేకసార్లు నల్లజాతీయులకు వ్యతిరేకంగా విద్వేష వ్యాఖ్యలు చేసిన ట్రంప్ అపఖ్యాతి మూటగట్టుకున్నారు.ఆయన హయంలోనే ప్రపంచాన్ని కుదిపేసిన జార్జ్ ఫ్లాయిడ్ హత్య జరిగింది.ట్రంప్ పాలనలో పోలీసులు కర్కశంగా వ్యవహరించిన సందర్భాలు చాలానే ఉన్నాయి.అటు NATO మిత్రదేశాలతోనూ అమెరికా సంబంధాలు ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే దెబ్బతిన్నాయి.

ఓటమి తర్వాత..

2020 అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయిన ట్రంప్ ఆ తర్వాత మరిన్ని వివాదాల్లో చిక్కుకున్నారు. ముఖ్యంగా 2021 జనవరి 6న క్యాపిటల్ హిల్ భవనంపై ఆయన మద్దతుదారులు దాడి చేయడం, అక్కడి పరిసరాలకు నిప్పు పెట్టడం అమెరికాను ఉలిక్కిపడేలా చేసింది. నాడు ఓటమిని జీర్ణించుకోలేకపోయిన ట్రంప్ తన సపోర్టర్స్‌ను ప్రసంగాలతో రెచ్చగొట్టడం కారణంగానే వారంతా విధ్వంసానికి దిగారని నాటి సైనికాధికారులే ప్రకటించారు. హౌస్ ఆఫ్ రిప్రజెంటెటివ్స్ నుంచి ట్రంప్ అభిశంసనలకు గురవడంతో ఆయన రాజకీయ జీవితం ముగిసినట్టేనని అంతా భావించారు. అయితే అందరి ఆలోచనలకు తగ్గట్టుగా నడుచుకుంటే ఆయన ట్రంప్ ఎందుకవుతారు.. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి గెలిచి అధ్యక్ష పీఠాన్ని అధిరోహించేందుకు రెడీ అయ్యారు.

పడిలేచిన కెరటంలా..

భారీ సంపద, హోదా ఉన్నప్పటికీ ఆయన ఎదుర్కొన్న ఎదురుదెబ్బలు, కిందపడి మళ్లీ లేచి గెలిచిన నైజం ఆయనలోని పోరాటయోధుడిని కళ్లకు కడుతోంది. ఎన్నో కష్టమైన ఆర్థిక, రాజకీయ క్షణాలను ఒంటరిగానే ఎదుర్కొన్న ట్రంప్ వ్యక్తిగతంగానూ ఎన్నో బాధలు పడ్డారు. ట్రంప్‌ని ఎన్నో అంశాల్లో తిట్టేవారు ఉండొచ్చు కానీ ఆయన్ను మెచ్చుకోకుండా ఉండలేని విషయం ఒకటుంది. ఆయన మందు తాగరు.. అల్కహాల్‌కు చాలా దూరంగా ఉంటారు. 1981లో తన సోదరుడు అల్కహాల్ అలవాటు కారణంగానే అనారోగ్యంతో చనిపోయాడు. ఇది ట్రంప్‌ను ఎంతగానో కుంగదీసింది. అందుకే మద్యాన్ని పుచ్చుకోని ట్రంప్ తన తోటివారికి కూడా మందు తాగవద్దని చెబుతుంటారు. అటు ట్రంప్ వైవాహిక జీవితం కూడా ఎన్నో వివాదాలతో ముడిపడి ఉంది. 1990లో మొదటి భార్య ఇవానాతో విడాకులు ట్రంప్‌ను మానసికంగా కుమిలిపోయేలా చేసింది. అటు ఆర్థికంగా తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టింది. ఇలా వ్యక్తిగతంగా, రాజకీయపరంగా ఎన్నో కష్టనష్టాలను అనుభవించిన ట్రంప్ మరోసారి అధ్యక్షుడిగా గెలవడాన్ని ఒక ఏడాది ముందు వరకు ఎవరు ఊహించి ఉండరు కూడా. అత్యంత శక్తివంతమైన వ్యక్తులు కూడా తమతో తామే మూసివేసిన తలుపుల లోపల సొంత యుద్ధాలను ఎదుర్కొంటారని చెప్పేందుకే ట్రంప్ జీవితమే ప్రత్యక్ష సాక్ష్యం.. మరి అగ్రరాజ్యపు అధ్యక్షునిగా మున్ముందు ప్రపంచానికి ఎటువంటి దక్షత ప్రదర్శిస్తాడో ఈ మొక్కవోని వ్యాపారి ట్రంప్. తన టెంపరితనంతో ప్రత్యర్థులకు టెంపరేచర్ పెంచి ఎదురులేని విక్టరీ సాధించిన ట్రంప్ వచ్చే నాలుగేళ్లు ప్రపంచంపై ఎలాంటి ప్రభావం చూపిస్తారో చూడాలి.

## ఆందోళనకరంగా అత్యాచారాలు, అఘాయిత్యాలు

అమరావతి,:రాష్ట్రంలో మహిళలు, బాలికలపై హత్యాచారాలు, దాడులు, లైంగిక వేధింపులు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఒకటి తరవాత మరొకటి అన్నట్లుగా అఘాయిత్యాలు చోటు చేసుకుంటున్నాయి. మృగాళ్లు భయం లేకుండా విచ్చలవిడిగా తెగబడుతున్నారు. బహిరంగంగా ఉరితీసే వరకు ఇవి ఆగవన్న రీతిలో సాగుతున్నాయి. మహిళలపై నేరాలు ఇంతగా పెచ్చుమీరడానికి ఉన్మాదులు యథేచ్ఛగా చెలరేగి పోవడానికి ప్రధాన కారణం నేరం చేయకూడదన్న భయం లేకపోవడమే. సత్వర దర్యాప్తు, నిందితులకు చట్ట ప్రకారం శిక్షలు పడితేనే నేరాలు అదుపులోకి వస్తాయి. ఒక్కో ఘటన చూస్తుంటే మనం నాగరిక సమాజంలోనే ఉన్నామా అన్న భయం కలుగుతోంది. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నా దారికి రావడంలేదు. ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి కఠనంగా శిక్షలు పడేలా చేస్తామని హోంమంత్రి అనిత హెచ్చరిస్తున్నారు. అలాగే డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కూడా పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు. వారం రోజుల్లోనే రాష్ట్రంలో ఇద్దరిపై గ్యాంగ్ రేప్, మరో ఇద్దరిపై ఘోర దాడులు కలచివేస్తున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో అత్తా కోడళ్లపై దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. కడప జిల్లా బద్వేలులో ఇంటర్ విద్యార్థినిపై ఆమె స్నేహితుడే పెట్రోలు పోసి తగలబెట్టగా, 90 శాతం గాయాలతో ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి చివరికి ప్రాణాలు విడవడం అత్యంత బాధాకరం. తెనాలిలో నర్సు దాడికి గురై బ్రెయిన్ డెడ్ స్టేజిలో గుంటూరు జనరల్ ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతోంది. ఇటీవలే నంద్యాల జిల్లాలో ఎనిమిదేళ్ల బాలిక అత్యాచారానికి, హత్యకు గురైంది. జూన్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వారానికే బాపట్ల జిల్లా చీరాల వద్ద పంట పొలాల్లో మహిళ మృతదేహాన్ని గుర్తించగా ఆమె సామూహిక అత్యాచారం, హత్యకు గురైందని గుర్తించారు. ఇవి తెలిసొచ్చిన అఘాయిత్యాల్లో కొన్ని మాత్రమే. బయటికి రానివి ఇంకా ఎన్ని ఉన్నాయో తెలీదు. జూన్‌లో బాపట్ల జిల్లాలో మహిళ హత్యాచారానికి గురైతే ఇప్పటికీ కేసు అతీగతీ లేదు. అలాంటిదే ఇంకో ఘటన జరిగాక తీరిగ్గా ఇప్పుడు ప్రత్యేక కోర్టులని, హైకోర్టుకు లేఖ రాస్తామంటున్నారు ముఖ్యమంత్రి, హోం మంత్రి. ఆడపిల్లపై చేయి వేసిన వాడికి అదే చివరి రోజవతుందని సి.ఎం, హోం మంత్రి నాలుగు మాసాల్లో ఎన్నో సార్లు హూంకరించినా ఘోరాలు ఆగింది లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళలపై, చిన్న పిల్లలపై నేరాలు 74 జరిగాయన్నది ఒక లెక్క. ఆరుగురు హత్యకు గురికాగా, మరో ఐదుగురు బలవన్మరణాలకు పాల్పడ్డారు. అలాగని ఈ ప్రభుత్వం వచ్చాకనే మృగాళ్లు పుట్టుకొచ్చారని కాదు. గత ప్రభుత్వంలోనూ మహిళలపై కిరాతకాలు జరిగాయి. దిశ పోలీస్‌స్టేషన్లు, యాప్ అన్నా ఘోరాలు నిరాటంకంగా జరిగాయి. ప్రస్తుత ప్రభుత్వం వల్లిస్తున్న ఫాస్ట్ ట్రాక్, స్పెషల్ కోర్టులు, నేరస్తులపై ఉక్కుపాదం వంటివి కూడా ఆ కోవలోనివే. అప్పుడూ ఇప్పుడూ మహిళలే సమిధలవుతున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు, పిల్లలు అదృశ్యమయ్యారని జనసేనాని ప్రకటించినా , తాను పాలనలోకొచ్చాక ఆ విషయాన్ని మర్చిపోయారని అనిపిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో స్త్రీలపై జరుగుతున్న దుర్మార్గాలపై మౌనం వహించడం ఎవరికీ మంచిది కాదు. స్త్రీలను బతకనివ్వని చెరబట్టే విపత్కర రోజులు దాపురించాయి. మహిళలకు రక్షణ కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. ప్రజలు కూడా చైతన్యం కావాలి. తమపక్కనేం జరుగుతుందో గమనించాలి. అత్యాచార ఘటనలు జరక్కుండా ఓ కన్నేయాలి. దుండగులను దునుమాడాలి. ప్రజలు మేల్కొంటే ఎంతటి రాక్షసులైనా తుదముట్టించవచ్చు.

## వాట్సాప్‌లో మరో సౌకర్యం

న్యూఢిల్లీ, వాట్సాప్ యూజర్ల భద్రతను దృష్టిలోఉంచుకొని ఎప్పటికప్పుడు వారికి మెరుగైన ఫీచర్లు అందించడం జరుగుతోంది. అలాగే భద్రత పరంగా అనేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్ ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లను తీసుకొస్తూనే ఉంది. స్పామ్ కాల్స్‌కు చెక్ పెట్టేందుకు పలు సదుపాయాల్ని తీసుకొచ్చిన ఎ÷–లాట్‌ఫామ్ తాజాగా ఇమేజ్‌ల మూలాలను గుర్తించే పనిలో పడింది. దీనికోసం రివర్స్ ఇమేజ్ సెర్చ్ సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. వాట్సప్‌లోని చిత్రాల కోసం మెసేజింగ్ యాప్ ఆప్షన్‌ను తీసుకొచ్చింది. దీని సాయంతో వాట్సప్‌లోనే నేరుగా ఇమేజ్ గురించి సెర్చ్ చేయొచ్చు. ప్లాట్‌ఫామ్‌లో నేరుగా ఈ ఆప్షన్ అందుబాటులో ఉంటుంది కాబట్టి.. ఇతర యాప్ లేదా బ్రౌజర్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. వాట్సప్ ద్వారా షేర్ చేసే కంటెంట్‌కు పారదర్శకతను మెరుగుపరచడమే ఈ ఫీచర్ లక్ష్యం. వాట్సప్ చాట్‌లో ఇమేజ్‌ని ఓపెన్ చేయగానే పైన కుడివైపున త్రీ డాట్స్ మెనూ కనిపిస్తుంది. దాన్ని క్లిక్ చేయగానే పలు ఆప్షన్లు దర్శనమిస్తాయి. దాన్ని క్లిక్ చేయగానే ఒక పాపప్ ఓపెన్ అవుతుంది. అందులో క్లిక్ చేసి రివర్స్ ఇమేజ్ సెర్చ్‌ను మొదలుపెట్టొచ్చు. అయితే ఇలా వెబ్ సెర్చ్ కోసం గూగుల్‌కు పంపే ఫొటోలు గోప్యంగా ఉంటాయని, మెటాతో షేర్ అవ్వవంటూ వాబీటా ఇన్ఫో స్పష్టం చేసింది. ఇక ఇమేజ్ గురించి సెర్చ్ చేయగానే దానికి సంబంధించిన మూలం, ఆ ఫొటో ఎక్కడినుంచి వచ్చింది, ఆన్‌లైన్‌లో ఈ ఫొటో వినియోగించిన ఇతర సందర్భాలు.. ఇలా అన్నీ కనిపిస్తాయి. అంతేకాదు ఆ ఫొటోను ఎడిట్ చేశారా, తప్పుదారి పట్టించేలా మార్చాలా అనే విషయాన్ని కూడా తెలుసుకోవచ్చు. కచ్చితత్వాన్ని అంచనావేయడం సులభతరం కానుంది. మొదటి బీటా యూజర్లకు ఈ ఫీచర్ అందుబాటులోకి రానుందని వాబీటా ఇన్ఫో తన బ్లాగ్‌లో పంచుకుంది. సంబంధిత ఫొటోను పోస్ట్ చేసింది. రానున్న వారాల్లో ఇది అందరికీ అందుబాటులోకి రానుందని వెల్లడించింది.

## అయ్యప్ప మాలధారులకు పండగ

తిరుపతి, కార్తీకమాసంలో అయ్యప్ప భక్తులకు నిజమైన పండగ. ఎక్కడచూసిన మాలధారులు కనిపిస్తుంటారు. శబరిమల అయ్యప్పస్వామిని లక్షలాది మంది తమ ఇష్టమైన దైవంగా కొలుస్తారు. ఎంతో మంది దేవుళ్లు ఉన్నా..అయ్యప్పస్వామికి ఓ ప్రత్యేకత ఉంది. అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేయడం, 41 రోజుల పాటు దీక్ష చేపడ్డటం, ఉత్సవాలు నిర్వహించడం అన్నీ ప్రత్యేకమే. శబరిమల ఆలయం కేరళ రాష్ట్రంలోని పట్టనంతిట్ట జిల్లాలో పశ్చిమ కనుమల్లో సహ్యాద్రి పర్వత శ్రేణుల మధ్య ఉంది. సముద్రమట్టానికి సుమారు 3వేల అడుగుల ఎత్తులో దట్టమైన అడవులు, 18 కొండల మధ్య కేంద్రీకృతమై ఉంది. శబరిమలకు చేరేందుకు పంబానది నుంచి కాలినడక మార్గం తప్ప ఎలాంటి రవాణా సౌకర్యం లేదు. తిరుమల కొండలు ఎంత ప్రత్యేకమైనవో, ఇక్కడ అయ్యప్ప కొండలు కూడా అంతే ప్రత్యేకమైనవి. శబరిమలలో ఉండే 18 మెట్లు 1984 వరకు రాతి మెట్లపైనే భక్తులు వెళ్లి అయ్యప్పస్వామిని దర్శించుకునేవారు. అప్పట్లో భక్తులు అయ్యప్ప దీక్ష ఎన్నిసార్లు తీసుకుంటే అన్నిమెట్లకు కొబ్బరికాయలు కొంటే ఆచారం ఉండేది. ఈ ఆచారం వల్ల మెట్లపై ఉండే రాళ్లు చెడి పోవడంతో 1985 సంవత్సరం నుంచి పంచలోహంతో కప్పి మెట్లను తయారు చేయించారు. బంగారం, వెండి, రాగి, ఇనుము, తగరం వంటి వాటిని ఈ 18 మెట్లకు అమర్చారు. ఎంతో పరమ పవిత్రంగా భావించే ఈ మెట్లపై ఇతరులెవ్వరిని అనుమతించరు.

# మౌనమునిలా కేసీఆర్.. నిస్తేజంలో క్యాడర్.. బీఆర్ఎస్ లో అసలేం జరుగుతోంది?



హైదరాబాద్,అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కేసీఆర్ మనసు నొచ్చుకుందని పలువురు పార్టీ నాయకులు చెబుతుంటారు. ఆ తర్వాత ఎంపీ ఎన్నికల ప్రచారం సందర్భంగా మాత్రమే ఆయన బయట కనిపించారు. కవిత జైలులో ఉన్న సందర్భం, విడుదలైన సందర్భంలోనూ ఆయన బయటకు రాలేదు. ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు.రాష్ట్రంలో రాజకీయంగా గతంలో కంటే భిన్న పరిస్థితి నెలకొంది. అధికారంలోకి వచ్చి పదినెలలు గడవకముందే కాంగ్రెస్ పార్టీ కొంత వ్యతిరేకతను మూటగట్టుకుంది. బీఆర్ఎస్ పార్టీకి ఇది కొంత లాభమే అయినా ఆ పార్టీ అధినేత కేసీఆర్ వ్యవహారశైలి ఇప్పుడు చర్చనీయాంశమవుతున్నది. తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ కు ప్రత్యేక స్థానం ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడిగా ఆయన ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లపాటు అధికారంలో ఉన్నారు. అయితే ఆయన తీసుకున్న నిర్ణయాలతో పాటు వ్యవహారశైలిపై వచ్చిన వ్యతిరేకతే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారానికి దూరమవడంలో ఒక కారణమనే టాక్ కూడా జోరుగా వినిపించింది. ఒంటెద్దు పోకడలతో పాటు క్యాడర్ ను కలువకపోవడం, సచివాలయానికి రాకుండా ఫామ్ హౌస్ కే పరిమితమవడం లాంటి ఆరోపణల నేపథ్యంలో ఆయన భారీ మూల్యాన్నే చెల్లించుకోవాల్సి వచ్చింది. బెట్టువీడని మనస్తత్వం కూడా మరో కారణంగా నిలిచిందని రాజకీయ విశ్లేషకులు చెబుతుంటారు. పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు, కవితతో పాటు కీలక నేతలున్నా ఈ సారి అధికారానికి దూరమవడం వెనుక కొన్ని తప్పిదాలు ఉన్నాయని చెప్పవచ్చు. ఇక్కడ మరోవిషయం ఏంటటే ఇప్పుడు కూడా ఆయన అదే ఫామ్ హౌస్ నుంచి తన రాజకీయాలను కొనసాగిస్తున్నారు. గత కొన్ని నెలలుగా ఆయన బయటకు వచ్చింది లేదు. ప్రజలను కలుసుకున్నది లేదు. వర్షాలు, హైడ్రా, మూసీ సుందరీకరణ తదితరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఆయన ఒక్క మాట కూడా మాట్లాడింది లేదు. మరి కేసీఆర్ మౌనముని ఎందుకయ్యారు. అసలు ఎక్కడున్నారు.. ఏంచేస్తున్నారు?అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కేసీఆర్ మనసు నొచ్చుకుందని పలువురు పార్టీ నాయకులు చెబుతుంటారు. ఆ తర్వాత ఎంపీ ఎన్నికల ప్రచారం సందర్భంగా మాత్రమే ఆయన బయట కనిపించారు. కవిత జైలులో ఉన్న సందర్భం, విడుదలైన సందర్భంలోనూ ఆయన బయటకు రాలేదు. ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు.ఇప్పటికే పార్టీ క్యాడర్ లో కొంత నిస్తేజం కనిపిస్తున్నది. కేటీఆర్, హరీశ్ రావు ఇటీవల పిలిచిన కొన్ని ఆందోళన కార్యక్రమాలకు పార్టీ క్యాడర్ నుంచి వచ్చిన స్పందనే ఇందుకు నిదర్శనంగా కనిపిస్తున్నది. ఫామ్ హౌస్ నుంచే అడపాదడపా కొన్ని ఫోటోలను మీడియాకు వదులుతున్నారు. ఇంతకుమించి కొన్ని నెలలుగా ఆయన ప్రజాక్షేత్రంలో ఎక్కడా కనిపించలేదు. హైదరాబాద్ కు కూడా రాలేదు. ఆయన మౌనం తుఫాను ముందు ప్రశాంతత లాంటిదని బీఆర్ఎస్ లో కొందరు నేతలు చెబుతున్నా,ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆయన రాక కోసం హార్డ్ కోర్ అభిమానులతో పాటు ప్రస్తుత ప్రభుత్వం కారణంగా బాధితులుగా మారిన ప్రజలు కూడా ఎదురుచూస్తున్నారు.

**కేసీఆర్ ఆరోగ్యంపై అనుమానాలు**

ఆయన అనారోగ్యం బారిన పడినట్లు వార్తలు వచ్చాయి. కుటుంబసభ్యులు ఈ విషయాన్ని దాస్తున్నారని ప్రతిపక్షనేతలు ఆరోపణలు గుప్పించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీకి కొంత సమయం ఇవ్వాలని ఆయన భావిస్తున్నారని, ఏడాది తర్వాత నేరుగా ప్రజల్లోకి వస్తారని చెబుతున్నారు. ఏది ఎలా ఉన్నా ప్రస్తుతం రాష్ట్రంలో కొంత ఇబ్బందికర వాతావరణం ఉంది. ఇలాంటి సందర్భంలో ఆయన బయటకు రావాలని కొందరు కోరుతున్నారు.అయినా కేసీఆర్ స్పందించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ ఇబ్బందికర పరిస్థితుల్లో కూడా ఆయన క్యాడర్ ను కలువకపోవడమేంటనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. అధికారంలో ఉండగా కూడా ఇలాగే ప్రవర్తించి ఈ పరిస్థితి తెచ్చుకున్నారని ఇప్పుడూ అదే రీతిలో ప్రవర్తిస్తున్నారని కొందరు లోలోపల మండిపడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వంపై క్షేత్ర స్థాయిలో వ్యతిరేక భావన పెరుగుతున్నది. ఇచ్చిన హామీలు నెరవేర్చకోవడం, స్తంభించిన పాలన కూడా ఇందుకు కారణంగా కనిపిస్తున్నది.ప్రభుత్వాధినేతకు అధికారులపై పట్టు రాకపోవడం కూడా మరో కారణంగా కనిపిస్తున్నది. ఇలాంటి సందర్భంలో కేసీఆర్ ప్రజల మధ్య ఉంటే పార్టీకి లాభం చేకూరుతుందని క్యాడర్ భావిస్తున్నది. పార్టీ ఓటమి తర్వాత ప్రజలే తప్పుచేశారన్నట్లుగా కేసీఆర్ తో పాటు కొందరు కీలక నేతల ప్రవర్తన ఉన్నట్లుగా బయట చర్చ జోరుగా సాగుతున్నది. అందుకే ఆయన ప్రజలకు దూరంగా ఉంటున్నట్లుగా చెబుతున్నారు. ఇదే నిజమైతే రాజకీయాల్లో ఇది తప్పుడు నిర్ణయమవుతుంది. మరోసారి తన వ్యవహారశైలిని బయట పెట్టుకున్నట్లవుతుంది.ఏపీలో చూసుకుంటే ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు నిత్యం ప్రజల్లోనే గడిపారు. పార్టీ తరపున ఆయన క్యాడర్ ను కాపాడుకుంటూ ముందుకెళ్లారు. తాను అండగా ఉంటానని వారికి భరోసానిచ్చారు. రాజకీయాలకు మాత్రమే పరిమితం కాకుండా ఆయన ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరిని కదిలించారు. ఇప్పుడు ఆయన అధికారపీఠం మరోసారి ఎక్కారు. ఓటమి నుంచి ఆయన ఎక్కడా వెనక్కి తగ్గలేదు. మరి తెలంగాణలో కేసీఆర్ పరిస్థితి వేరుగా ఉంది.రాజకీయ చాణక్యుడిగా పేరున్న కేసీఆర్ ఇలా ఎందుకు చేస్తున్నారో చాలా మందికి అర్థం కావడం లేదు. ఆయన మౌనం వెనుక ఏదో బలమైన కారణం ఉండే ఉంటుందని అనుకున్నా, ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితులతో ప్రజలు కొంత ఇబ్బందికరంగా ఫీలవుతున్నారనేది నిజం.మరి కీలక నేతగాఉన్న కేసీఆర్ బయటకు వచ్చి ప్రభుత్వంపై కదనభేరి మోగించాల్సిన అవసరం ఉంది. అయినా ఆయన ఎక్కడా పర్యటించిన దాఖలాలు లేవు. మరి ఈ మౌనంఇంకెన్నాళ్లో వేచి చూడాలి. ఒకవేళ ఆరోగ్య సమస్యలు నిజమైతే అవి ప్రజలకు కుటుంబసభ్యులే చెప్పాల్సిన అవసరం ఉంది. ఏదేమైనా ప్రస్తుతం తెలంగాణలో .కేసీఆర్ లేని స్పేస్ స్పష్టంగా కనిపిస్తున్నదనే భావన వినిపిస్తున్నది.

# ఏపీని అత్యాధునిక ఏఐ హబ్ గా మార్చేస్తున్న బాబు..



అమరావతి,రాష్ట్ర సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు సీఎం చంద్రబాబు. ఒకవైపు పాలనను గాడిలో పెడుతూనే.. మరోవైపు అభివృద్ధిపై దృష్టి పెట్టారు. ముఖ్యంగా కొన్ని కీలక రంగాల్లో సంస్కరణలు తీసుకొచ్చి.. అభివృద్ధి బాటలు వేయాలన్నది చంద్రబాబు ప్లాన్. అందుకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించారు.ఏపీ సీఎం చంద్రబాబు ఆలోచనలు భిన్నంగా ఉంటాయి. వైవిధ్యంగా కూడా ఉంటాయి. ఏదైనా ముందుచూపుతో వ్యవహరిస్తారన్న మంచి పేరు ఆయనకు ఉంది. సైబరాబాద్ ఆలోచన ఆయనదే. ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా.. ఈ విషయంలో మాత్రం మెజారిటీ ప్రజలు చంద్రబాబుకు జై కొడతారు. అయితే అనూహ్య పరిస్థితుల్లో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చింది. గత అనుభవాల దృష్ట్యా అభివృద్ధితోపాటు సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు భావిస్తున్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు,రాష్ట్రానికి ఆదాయం సమకూర్చుకోవడం పై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు.ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్ గా మార్చే ప్రణాళికలను రూపొందించారు.ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ,డ్రోన్ తయారీ,సెమీ కండక్టర్ పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తుల్లో ఏపీని అగ్రగామిగా నిలపాలన్నది చంద్రబాబు లక్ష్యంగా తెలుస్తోంది. భవిష్యత్తులో అన్ని రకాల సేవలు, లావాదేవీలు డ్రోన్ టెక్నాలజీ ద్వారా జరగనున్నాయి. మొన్న విజయవాడ వరదల్లో సైతం డ్రోన్లతోనే బాధితులకు ఆహారం అందించారు. అదే డ్రోన్లతోనే సాగులో అనేక రకాలైన సేవలు చేపడుతున్నారు. దాదాపు అన్ని రంగాల్లో డ్రోన్ల ఎంట్రీ ఖాయంగా తెలుస్తోంది. అందుకే ఆ రంగంపై చంద్రబాబు దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

**మొన్ననే అంతర్జాతీయ డ్రోన్ల ప్రదర్శన**

మొన్న ఆ మధ్యన విజయవాడలో అంతర్జాతీయ డ్రోన్ల ప్రదర్శన నిర్వహించిన సంగతి తెలిసిందే. ప్రపంచ నలుమూలల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.సరికొత్త ఆవిష్కరణలు చేశారు. అయితే దీని వెనుక చంద్రబాబు ప్రత్యేక వ్యూహం ఉంది. అమరావతిని డ్రోన్ల హబ్ గా మార్చాలి అన్నది చంద్రబాబు ప్లాన్. దేశం యావత్తు అమరావతి వైపు చూసేలా.. భారీ డ్రోన్ల రూపకల్పనకు అమరావతిని చిరునామా చేయాలన్నది లక్ష్యం. అందుకే ఇక్కడ డ్రోన్ల ప్రదర్శన నిర్వహించారు. ప్రపంచ నలుమూలల నుంచి ప్రతినిధులను ఆహ్వానించి.. అమరావతి చర్చకు వచ్చేలా చేశారు. మరోవైపు డ్రోన్ ఉత్పత్తి కంపెనీలకు అనంతపురంలో డెస్టినేషన్ గా మార్చాలని చంద్రబాబు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఇప్పటికే శ్రీ సిటీలో పరిశ్రమలు భారీగా ఏర్పాటయ్యాయి. దానిని సెమీ కండక్టర్ హబ్ గా మార్చేందుకు చంద్రబాబు ఆలోచన చేస్తున్నారు.

**ఐటీ అభివృద్ధికి ప్లాన్**

మరోవైపు సాగరనగరం విశాఖలో ఐటీ అభివృద్ధికి ప్లాన్ చేస్తున్నారు చంద్రబాబు. ఇప్పటికే నారా లోకేష్ అమెరికా వెళ్లారు. దిగ్గజ పారిశ్రామికవేత్తలను కలిశారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారు.విశాఖలో ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి అన్ని రకాల వసతులు ఉన్నాయి. అందుకు అక్కడ మరింత అభివృద్ధి చేసి.. ఐటీ రంగంలో విశాఖను దేశంలోనే అగ్రగామిగా నిలపాలని చంద్రబాబు భావిస్తున్నారు. మొత్తానికి అయితే మంచి ఆలోచనలతో ముందుకు సాగుతున్నారు బాబు. మంగళవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షలు జరిపారు. టెక్నాలజీ రంగంలో సంస్కరణలు తీసుకురానున్నట్లు తెలిపారు. అవి మంచి ఫలితాలు ఇస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# టీటీడీ ట్రస్ట్ బోర్డ్.. బిజెపి నేతలకు దక్కని చోటు!



అమరావతి,టీటీడీ ట్రస్ట్ బోర్డును ప్రకటించారు. చైర్మన్ గా టీవీ5 అధినేత బిఆర్ నాయుడు నియమితులయ్యారు. మరో 24 మంది సభ్యులను సైతం తీసుకున్నారు. సభ్యులుగా టిడిపి ఎమ్మెల్యేలు ముగ్గురికి అవకాశం దొరికింది. ఆ పార్టీ నేతలకు సైతం ఛాన్స్ ఇచ్చారు. జనసేన సిఫార్సులకు పెద్దపీట వేశారు. వివిధ రంగాల ప్రముఖులకు అవకాశాలు కల్పించారు. అయితే ఏపీ బీజేపీ నేతలను మాత్రం కనీస పరిగణలోకి తీసుకోలేదు. ఒక్కరంటే ఒక్కరిని కూడా సభ్యులుగా నియమించలేదు. దీంతో బిజెపిలో ఒక రకమైన అసంతృప్తి కనిపిస్తోంది. చాలామంది బిజెపి నేతలు తిరుమల వ్యవహారాలపై ఎక్కువగా దృష్టి పెడతారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో టీటీడీలో వైఫల్యాలను చాలామంది బిజెపి నేతలు బయటపెట్టారు. హై కమాండ్ కు ఫిర్యాదు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. కానీ అప్పట్లో ఉన్న రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా హైకమాండ్ పెద్దగా పట్టించుకోలేదు. అయితే తాము భాగస్వామ్యంగా ఉన్న కూటమి ప్రభుత్వం రావడంతో.. తమ సేవలను వినియోగించుకుంటారని బిజెపి నేతలు భావించారు. కానీ టీటీడీ ట్రస్ట్ బోర్డు జాబితాలో తమ పేర్లు లేకపోయేసరికి సదరు బిజెపి నేతలు తెగ బాధపడిపోయారు. తమను కనీస పరిగణలోకి తీసుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తొలి నుంచి బిజెపిని నమ్ముకున్న తమకు అన్యాయమే జరుగుతోందన్న ఆవేదన, బాధ వారిలో కనిపిస్తోంది.

**సార్వత్రిక ఎన్నికల్లో అలా**

మొన్నటి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీతో జతకట్టింది బిజెపి. జనసేన ను కలుపుకొని మూడు పార్టీలు కలిసి పోటీ చేశాయి. అయితే బిజెపికి ఆరు పార్లమెంట్ స్థానాలతో పాటు పది అసెంబ్లీ సీట్లు కేటాయించారు. అయితే అందులో ఒకటి రెండు తప్ప మిగిలిన సీట్లలో కొత్తగా వచ్చిన వారు మాత్రమే పోటీ చేశారు. బిజెపి కోసం అహర్నిశలు శ్రమించిన చాలామంది నేతలకు అప్పట్లో టిక్కెట్లు దక్కలేదు. పోనీ కూటమి గెలిచిన తర్వాత నామినేటెడ్ పోస్టులు దక్కుతాయని భావించారు. అక్కడ కూడా వారికి మొండి చేయి మిగిలింది. ఇప్పుడు టీటీడీ ట్రస్ట్ బోర్డులో సైతం తమకు చాన్స్ దక్కలేదని బిజెపి నేతలు చాలామంది బాధపడుతున్నారు. పదవులు, భవిష్యత్తుపై ఆశలు వదులుకుంటున్నారు.

**ఆ యాక్టివ్ నేతలకు సైతం**

తిరుపతికి చెందిన భాను ప్రకాష్ రెడ్డి నిత్యం టిటిడి వైఫల్యాల గురించి మాట్లాడుతుంటారు. ఆయన చాలా రోజులుగా బిజెపిలో కొనసాగుతున్నారు. బిజెపి భావజాలాన్ని వ్యక్తం చేయడంలో ముందుంటారు. అదే సమయంలో రాయలసీమకు చెందిన చాలామంది బిజెపి నేతలు తిరుమల తిరుపతి దేవస్థానం వ్యవహారాలపై ఎక్కువగా దృష్టి పెడుతుంటారు. కూటమి రావడంతో దేవుడు సేవకు తమకు చాన్స్ ఇస్తారని వారు భావించారు. ఓ నేత అయితే బిజెపి మాజీ చీఫ్ ద్వారా హై కమాండ్ కు దరఖాస్తు కూడా చేసుకున్నారు. కేంద్ర పెద్దలకు కూడా విజ్ఞప్తి చేశారు. అయితే బిజెపి నేతలకు ఛాన్స్ మాత్రం ఇవ్వలేదు. కానీ గుజరాత్ కు చెందిన డాక్టర్ అజిత్ దేశాయ్ మాత్రం బిజెపి కీలక మంత్రి సిఫారసులతో టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా పదవి దక్కించుకోవడం విశేషం.

# ఢిల్లీలో కొనసాగుతున్న వాయు కాలుష్యం..



న్యూఢిల్లీ, దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం కొనసాగుతోంది. రోజురోజుకూ కాలుష్యం తీవ్రమవుతోంది. కాలుష్యం కారణంగా ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు వాయు కాలుష్యంతో ఊపిరితీసుకోవడం ఇబ్బందికరంగా మారగా.. మరో వైపు నీటి కాలుష్యంతోనూ సతమతమవుతున్నారు. యయునా నదిలో కాలుష్య స్థాయి విపరీతంగా ఉన్నది.కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సెంట్రల్ పోల్యూషన్ కంట్రోల్ బోర్డ్) ప్రకారం.. దేశ రాజధాని నగరంలో బుధవారం ఉదయం 8 గంటల సమయంలో గాలి నాణ్యత సూచి 358గా నమోదైంది. అలీపూర్‌లో ఏక్యూఐ (వాయు నాణ్యత సూచిక) 372గా, బావన ప్రాంతంలో 412, ద్వారకా సెక్టార్ 8లో 355, ముంద్కాలో 419, నజాఫ్‌గఢ్ ప్రాంతంలో 354, న్యూ మోతి భాగ్‌లో 381, రోహిణిలో 401, ఆర్కేకే ఐగా బాగ్8లో 381 ఆయా ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ అధ్వాన స్థితిలో ఉన్నట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ కనిపెట్టింది.కాలుష్యం నేపథ్యంలో విజిబులిటీ కూడా తగ్గింది. పలు ప్రాంతాల దట్టమైన పొగమంచు కమ్మేసింది. వివేక్ విహార్, ఆనంద్ విహార్, ఇండియా గేట్ మొదలైన వాటిలో 500 మీటర్ల వరకు దృశ్యమానత తగ్గింది. పెరుగుతున్న కాలుష్యంతో ప్రజల కళ్లల్లో మంటలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. ఈ వైద్య నిపుణుల హెచ్చరికలు చేస్తున్నారు. గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచిస్తున్నారు.ఇంట్లోనే ఉండి యోగా, ప్రాణాయామం చేస్తున్నారు. ఢిల్లీలో వాయుకాలుష్యం పెరుగుతోందని ఢిల్లీలోని పర్యావరణ ప్రభుత్వ శాఖ మంత్రి గోపాల్ రాయ్ పేర్కొన్నారు. కాలుష్యాన్ని తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. కాలుష్య స్థాయిని తగ్గించేందుకు సంబంధిత ఏజెన్సీలన్నీ చురుగ్గా పని చేస్తున్నాయని.. కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో శీతాకాల కార్యాచరణ ప్రణాళిక కింద వివిధ శాఖలు, ఏజెన్సీలు నిర్వహిస్తున్న కార్యక్రమాలను మంగళవారం సమీక్షించిన గోపాల్ రాయ్ గుర్తించారు. ఇందులో అవసరాన్ని బట్టి తగిన చర్యలు తీసుకునేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తుంది.గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 వరకు ఉంటే ప్రమాదకర స్థాయిలో పరిగణిస్తారు. అయితే, గత కొంతకాలంగా ఢిల్లీలో గాలి ప్రమాదకరంగా మారుతున్న విషయం తెలిసిందే. పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలపెట్టడానికి తోడు.. మంచు రాజధానిని కమ్మేయడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. కాలుష్య పాలకులు ఎన్ని చర్యలు నియంత్రణలో ఉన్నా ఫలితం లేదు. రోజురోజుకూ గాలి నాణ్యత క్షీణిస్తోంది. ఈ కారణంగా నగర వాసులు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురికావాల్సి వస్తోంది.

# కుల గణన కోసం ఒక్కపూట బడులా..?



హన్మకొండ : రాష్ట్ర ప్రభుత్వం కులగణన కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులను ఉపయోగించడం, ప్రభుత్వ పాఠశాలలకు ఈ నెల 30 వరకు ఒక్కపూట బడులు నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడంపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ఇదేం దిక్కుమాలిన ఆలోచన రేవంత్ రెడ్డి గారు? కుల గణన కోసం ఒక్క పూట మాత్రమే బడులు పెడుతారా ? అది కూడా మూడు వారాల పాటు! మీ పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటారా? అని సూటిగా ప్రశ్నించారు. పేద, బడుగు బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీల పిల్లలు చదువుతా రు కాబట్టి మీరు ఒక పూట బడులు కూడా మూసేస్తారా? పేదలంటే ఇంత నిర్లక్ష్యమా? అయినా టీచర్లు ఉన్నది స్కూల్లో పాఠాలు చెప్పడానికా? లేక సర్కారు పనులన్నీ చేయడానికా? లక్షల మంది నిరుద్యోగులు పనుల్లేక అల్లాడుతున్నారు. వాళ్ళతో చేయించుకోవచ్చు కదా మీ సర్వేలు? అంటూ రాకేశ్ రెడ్డి మండిపడ్డారు.సామాజిక న్యాయం చేయడానికి తప్పనిసరిగా కులగణన జరగాలి.. కానీ, అందుకు ఇతర డిపార్ట్‌మెంట్‌లను వాడుకోవాలని సూచించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఒక్కరోజులోనే రాష్ట్రమంతా సమగ్ర కుటుంబ సర్వే చేశారని, కానీ ఈ ప్రభుత్వం బీసీల అంశాన్ని రాజకీయం చేసి కాలయాపన చేయడం కోసమే ఈ తంతు నడిపిస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని ఏనుగుల రాకేశ్ రెడ్డి డిమాండ్ చేశారు.

# పవన్ మళ్లీ ఎఫెన్స్‌లోకి వచ్చినట్లే.. అసలు రీజన్ ఇదేనా?




విజయవాడ:జనసేన అధినేత పవన్ కల్యాణ్ మళ్లీ ఎన్నికలకు ముందు తరహా రాజకీయాలను ప్రారంభించినట్లే కనపడుతుంది. ఫుల్లు ఎఫెన్స్ లో కనపడుతున్నారు. నిన్నటి వరకూ తన పని ఏదో తాను చూసుకుంటూ పవన్ కల్యాణ్ పెద్దగా బయటకు కనిపించలేదు. ఆయన తనకు కేటాయించిన శాఖలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీశాఖలను ఆయన పూర్తిగా అధ్యయనం చేశారు. అధికారులతో సమీక్షలు, ఉత్తర్వులకే పరిమితమైన పవన్ కల్యాణ్ నేడు గ్రౌండ్ లోకి ఎంటర్ అయ్యారు. వచ్చీ రావడంతోనే ఇటు కూటమి ప్రభుత్వంపైనా, అటు విపక్షంపైనా విరుచుకుపడుతూ వెళ్లడం దేనికి సంకేతం అన్న చర్చ జరుగుతుంది. నిన్న పిఠాపురం నియోజకవర్గంలో కూటమిలో ఉంటున్న టీడీపీ నేత చేతిలో ఉన్న హోంశాఖపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హోంశాఖను సరిగా నిర్వహించడంలేదంటూ మండిపడ్డారు. వంగలపూడి అనిత నుంచి తాను హోంశాఖను తీసుకుంటే పరిస్థితులు వేరుగా ఉంటాయని హెచ్చరికలు కూడా జారీ చేశారు. పోలీసు ఉన్నతాధికారుల నుంచి కూటమి పార్టీల నేతల వరకూ పిఠాపురంలో పవన్ కల్యాణ్ ఏకిపారేశారు. నిజానికి పవన్ కల్యాణ్ కు రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యపై అసంతృప్తి ఉంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో నేరుగా చెప్పవచ్చు. లేదంటే మంత్రివర్గ సమావేశంలో ప్రస్తావించవచ్చు. కానీ పవన్ అలా చేయలేదు. జనం సమక్షంలో హాట్ కామెంట్స్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. అసలు కూటమిలో ఏదో జరుగుతుందన్న అనుమానాలను లేవనెత్తారు. ఇటు రాష్ట్రం.. అటు పార్టీని ఒంటిచేత్తో? జగన్ కంపెనీ వద్దకు చేరుకుని... ఇక పిఠాపురం నియోజకవర్గంలో రెండు రోజుల పాటు పర్యటించాల్సి ఉన్నప్పటికీ మరుసటి రోజు పల్నాడు ప్రాంతానికి పవన్ కల్యాణ్ చేరుకున్నారు. అక్కడ వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు సంబంధించిన సరస్వతీ పవర్ భూములను సందర్శించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. అన్యాక్రాంతమైన భూముల విషయాలను పవన్ ప్రస్తావించారు. పేదల భూములను జగన్ బలంవంతంగా సొంతం చేసుకున్నారంటూ మండిపడ్డారు. జగన్ సీఎం అయిన తర్వాత ఈ కంపెనీకి భూముల లీజును యాభై ఏళ్ల పాటు పొడిగించుకున్నారన్నారు. కోడెల శివప్రసాద్ ను ఫర్నిచర్ కోసం వేధించి నాటి ప్రభుత్వం చంపేసిందంటూ పల్నాడు పర్యటనలో వ్యాఖ్యానించారు. భూములు లాక్కున్న వారికి సరస్వతీ పవర్స్ లో ఉద్యోగాలు ఇవ్వాల్సిందేనంటూ రైతుల వద్ద ఆయన డిమాండ్ చేశారు. డిప్యూటీ చీఫ్ మినస్టర్ గా ఉన్న పవన్ కల్యాణ్ ఇలా ఆవేశంగా మాట్లాడటం.. తన, తరతమ బేధల్లేకుండా మాట్లాడుతుండటం రాజకీయంగా చర్చకు దారితీసింది. అసలు పవన్ కల్యాణ్ మనస్సులో ఏముందన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. 2027 నాటికి తాను కీలకంగా మారాలని పవన్ భావిస్తున్నారా? అన్న అనుమానం మాత్రం కూటమి పార్టీల్లోనూ బయలుదేరింది. ఢిల్లీ నుంచి ఏదైనా సిగ్నల్స్ అందా?యా? అన్న చర్చకూడా ఏపీ పాలిటిక్స్ లో జరుగుతుంది. పవన్ కల్యాణ్ ఇన్నాళ్లు మౌనంగా ఉండి, చంద్రబాబు నాయుడుపై ప్రశంసలు కురిపించి కొంచెం ఇమేజ్ తగ్గడంతో తిరిగి దానిని పొందేందుకు ప్రయత్నిస్తున్నారా? అన్న అనుమానం కూడా లేకపోలేదు. మొత్తం మీద గత రెండు రోజులుగా పవన్ కల్యాణ్ చేస్తున్న కామెంట్స్, పర్యటిస్తున్న తీరు అనేక అంశాలకు చర్చనీయాంశంగా మారింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com